

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 88 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 27, ఫిబ్రవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# ఇంకెంత కాలం.. ఈ వేధింపులు




డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

యువత జీవితాలను నాశనం చేస్తున్న రాజకీయ నాయకులు

ప్రతిపక్ష నాయకులపై,పడని యువకులపై పగబడుతున్నారు

పోలీసులచే బెదిరిస్తూ విపరీతంగా కొట్టిస్తున్నారు

పార్టీలకు సహకరించకుంటే అదోగతేజెండాలు మోయమని జబర్దస్తీగా బెదిరిస్తున్నారు

చదువుకోవాల్సిన యువత రాజకీయాలకు అలవాటు పడుతున్నారు

యువతను నాశనం చేసేవి రాజకీయాలే

అడ్డమైన వెధవలంతా పార్టీ మారితే సొక్కందారులైపోతున్నారు

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భూకబ్జాదారులదే ఏ పార్టీలోనైనా హవా నడుస్తుంది

నాయకుల అనుచరులే హంగామా చేస్తున్నారు : డాక్టర్ బరిగెల శివ



హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

యువత జీవితాలను విచ్ఛిన్నం చేయడం కోసం అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధుల అనుచరులు తీవ్రంగా కుట్రలు పన్నుతున్నారని డాక్టర్ బరిగెల శివ హెచ్చరించారు. భూకబ్జాదారులపై చర్యలు తీసుకునే చేతగాని స్టేషన్స్ అధికారులు నాయకుల అనుచరులకు పడని యువకులపై పోలీసు పెట్టిస్తూ తీవ్రంగా కొట్టిస్తుండడమే కాకుండా అక్రమ కేసులని బనాయిస్తూ వాళ్ల జీవితాలను ఎందుకు పనికి రాకుండా చేస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు. అధికార పార్టీ జెండాలు మోయకపోతే యువతను నాశనం చేసే పనిలో నిమగ్నమవుతున్న నాయకుల అనుచరులు చేస్తున్న పనుల వల్ల యువతలో నాయకుల పలుకుబడి పలుచనవుతుందని గుర్తు చేశారు.ఏ పోలీస్

- మిగతా 2లో..



## తెలంగాణలో 45 మంది ఐఏఎస్‌ల బదిలీ

రాహుల్ బొజ్జాకు సాధారణ పరిపాలన శాఖ బాధ్యతలు

పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్ కుమార్

రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్

యాదాద్రి భువనగిరి జిల్లా కొత్త కలెక్టర్‌గా అనురాగ్ జయంతి




6

## యూట్యూబర్ కోమలి ఆత్మహత్య..

కలచివేస్తున్న డైరీలోని చివరి మాటలు

హైదరాబాద్‌లో యూట్యూబర్ బోను కోమలి అనుమానాస్పద మృతి


ఆత్మహత్యకు ముందు తన డైరీలో రాసిన చివరి నోట్ వెలుగులోకి

ప్రియుడితో బ్రేకప్ కారణంగానే బలవన్మరణానికి పాల్పడినట్లు అనుమానం

కువైట్‌లో ఉన్న తల్లికి చివరిసారిగా మెసేజ్ పంపిన కోమలి

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

6



## మీడియా అక్రిడిటేషన్ల కోసం జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు

4

## ఇతడే... నా భర్త విజయ్ దేవరకొండ: రష్మిక మందన్న

ఒక్కటైన టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న

6





## జూబ్లీహిల్స్‌లో భారీ అగ్నిప్రమాదం

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

జూబ్లీహిల్స్ మెట్రోస్టేషన్ సమీపంలోని ఓ బిల్డింగ్ లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మంగళగౌరి వస్త్ర దుకాణంలో మంటలు చెలరేగాయి. బిల్డింగ్ ముందు భాగంలో మంటలు ఎగసిపడుతున్నాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఫైరింజన్లతో నీళ్లు చల్లుతూ మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# ఇంకెంతకాలం "ఈ" వేధింపులు

మొదటి పేజీ తరువాయి

అధికారైన అధికార పార్టీలో ఉన్న యువత దుర్మార్గపు పనులను చూస్తూకూడా చూడనట్టు వదిలేస్తూ పేదవాళ్లైన యువతను తీవ్రమైన ఇబ్బందులు పెట్టడం పలుమార్లు స్టేషన్లలోనికి పిలిపిస్తూ ఇష్టం వచ్చినట్టు కొడుతుండడం రాష్ట్రంలో ఏ పోలీస్ స్టేషన్లో చూసిన ఇదే తంతు నడుస్తుందని యువత బాధను సమాజానికి తెలియజేశారు.చదువుకోవాల్సిన యువత ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించకపోవడంతో మార్గమధ్యలోనే చదువులు మానేస్తూ పనులు చేసుకుంటున్నారని ప్రభుత్వాలను నిలదీశారు.మొత్తం మీద యువత చదువుకోకూడదనే సిద్ధాంతాలను ప్రభుత్వాలు కావాలనే అమలుపరుస్తూ యువతను సన్మార్గంలో నడిపించాల్సింది పోయి దుర్మార్గపు అలవాట్లకు చెడు అలవాట్లకు బానిసలయ్యే విధంగా చేస్తుండడం ఎంతో విచారకరమన్నారు.రాజకీయ నాయకుల పిల్లలు,ప్రభుత్వ అధికారుల పిల్లలు లక్షల రూపాయల ఫీజులు చెల్లిస్తూ ప్రైవేట్ కార్పొరేట్ విద్య సంస్థలలో విశ్వవిద్యాలయాలలో విద్యను కొనసాగిస్తుండగా సాధారణ విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వంపై ఆధారపడి మాత్రమే చదువుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయని బాధ వ్యక్తం చేశారు.ఫీజులు చెల్లిస్తే తప్ప చదువుకోలేని పరిస్థితిలో లక్షల కొద్ది విద్యార్థులు చేరిపోతున్నారని ఆవేదన చెందారు.ప్రభుత్వాలు ఫీజులు చెల్లించడంలో ఆలస్యం చేస్తున్నందున యువత జీవితాలు విద్యార్థుల జీవితాలు ఆగమైపోతున్నాయని గుర్తు చేశారు.సకాలంలో ఫీజులు చెల్లిస్తూ ప్రభుత్వాలు విద్యార్థులను ఆదుకోగలిగితే విద్యార్థులకు ఎంతో మేలు చేసిన వారు అవుతారని తెలిపారు.ప్రస్తుతం రాజకీయాల పరంగా చూసినట్లయితే రాజకీయ నాయకుల ఆలోచన సంవిధానం బగానే ఉంటున్నప్పటికిని కొన్ని సందర్భాల్లో నాయకుల అనుచరులు వీరంగాలను, హంగామాలను సృష్టిస్తున్నారని హెచ్చరించారు. నాయకుల చుట్టూ దంకా భజన కొట్టే ముఠాలు ఎక్కువైపోయాయని ఎద్దేవా చేశారు. రాజకీయ నాయకులను స్వతహాగా ప్రజల కొరకు సేవ చేయనీయకుండా విపరీతంగా అడ్డుపడుతున్న నకిలీ ముఠాలు రాజకీయ నాయకుల చుట్టూ చేరిపోయి ప్రజాసేవను కుంటుపడేస్తుండటమే కాకుండా యువత జీవితాలపై రాజకీయపు ప్రభావాన్ని ప్రేరేపింప చేస్తున్నారని హెచ్చరించారు.ప్రభుత్వ విశ్వవిద్యాలయాలన్నీ వెనకబడిపోవడానికి ప్రధాన కారణం ప్రభుత్వాలు సరియైన నిధులను కేటాయించడం లేదని అన్ని విశ్వవిద్యాలయాలలో విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు.ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ప్రైవేట్ విద్యాసంస్థలు పేద విద్యార్థులకు విద్యను అందించే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు.లక్షల కోట్ల రూపాయలు పెట్టుకొని చదువుకునే స్తోమత లేని విద్యార్థులు ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకోవాలని ఆనందపడుతున్న సందర్భాల్లోనే సకాలంలో ఫీజులు చెల్లించబడక అనేక రకాల మనోవేదనకు గురి కావడం జరుగుతుందన్నారు.ఒకవైపు రాజకీయ నాయకుల వేధింపులు మరోవైపు పోలీస్ అధికారుల వేధింపులు అవే కాకుండా ప్రభుత్వం ప్రత్యక్ష వేధింపులు ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని రకాల వేధింపులు యువత జీవితాలపై శాశ్వతమైన ముద్రను వేస్తున్నాయని యువత జీవితం పక్కదారి పట్టడానికి ప్రధానమైన బలమైన కారణాలను గుర్తుకు చేస్తూ ప్రభుత్వాలు ఉద్యోగ నోటిఫికేషన్స్ విడుదల చేయకపోవడం వల్ల నిరుద్యోగ యువత ఎక్కువగా పెరిగిపోతున్నారని ప్రభుత్వ ఆధీనంలో గల ఉద్యోగాలను కూడా విడుదల చేయడంలో ఇంతటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్న ప్రభుత్వాలు నిరుద్యోగ యువత, చదువుకుంటున్న యువత జీవితాలపై పెను ప్రమాదాలను తెచ్చిపెడుతున్నాయని క్షేత్రస్థాయిలో విమర్శించారు.యువతను దారిలో పెట్టే మార్గంలో ప్రభుత్వాలు ఎంతో బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుందని ప్రతి ప్రభుత్వంలోని ప్రధాన నాయకులు ఎంతో కొంత యువత పట్ల సదుద్దేశమైన ఆలోచనలతో సహాయక చర్యలు చేపడుతున్నప్పటికి అవి కేవలం అంతంత మాత్రమే అవుతుండగా లపై నిరాశతో ఉన్న యువత లక్షల సంఖ్యలో పెరిగిపోతున్నందున యువత పట్ల ప్రభుత్వాలు నాయకులు అధికారులు బాధ్యతలు మర్చిపోతున్నారని గుర్తు చేశారు.కొంతమంది పోలీస్ ఉన్నతాధికారులు యువతను సన్మార్గంలో పెట్టడానికి పని వృత్తులను కల్పిస్తూ ఆదుకుంటున్నారని గుర్తు చేశారు.యువతకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవాల్సి ఉంటుండగా నిరుద్యోగ భృతి కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తెలుపుతూ చదువుకుంటున్న విద్యార్థులను ఆర్థికపరమైన ఇబ్బందులు వెంటాడుతున్నాయని గుర్తు చేశారు.రాష్ట్రంలో చాలా చోట్ల ఐదు రూపాయల భోజనంతో చదువుకుంటున్న యువత లక్షల్లో కలరని దాన్ని బట్టి చూస్తే ప్రభుత్వాలకు యువత అభివృద్ధి పైన ఎలాంటి శ్రద్ధను చూపిస్తుందో ప్రజలందరూ గమనించవలసిన అవసరం ఉందన్నారు.యువత పట్ల ప్రభుత్వాలు ప్రజా నాయకులు ప్రత్యేకమైన శ్రద్ధను కనపరచినట్లయితే సమాజాన్ని ప్రశాంతమైన వాతావరణంగా తీర్చి దిద్దుకోగలమని గుర్తు చేశారు.రాష్ట్రవ్యాప్తంగా యువత చెడు మార్గాలకు అలవాట్లకు అలువాటుపడుతూ మాదకద్రవ్యాల ముసుగులో జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఎంతో ఆవేదన చెందారు.ప్రభుత్వ విద్యాసంస్థలు దినదినానికి కుంటుపడుతున్నాయని అన్ని ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యాసంస్థలను అభివృద్ధి చేయాలనే ఆలోచనను మర్చిపోతున్నాయని తీవ్రంగా మందలించారు.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సాధారణంగా పని చేసుకునే యువకులపై నాయకుల రాక్షసత్వం ప్రదర్శిస్తున్నారని రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా యువత నాశనాన్ని కోరుకుంటున్నారని వివరంగా హెచ్చరించారు.యువత జీవితాలు బాగుపడితేనే ప్రభుత్వాలకు మేలు జరుగుతుంది కానీ యువతను నాశనం చేసి ప్రభుత్వాలు లబ్ధి పొందాలనుకోవడం ఎంత మాత్రం మంచిది కాదన్నారు.తప్పుడు మాటలతో కొండెంగి మాటలతో యువతను పగబట్టి యువత జీవితాలను వేధించుకుంటూ పోతే అట్టి మానసిక వేదనలు తట్టుకోలేక, పోలీసులు కొట్టే దెబ్బలు తట్టుకోలేక చాలా చోట్ల యువత తెలియకుండానే చనిపోతున్నారన్నారు.అధికార పార్టీలకు చెందిన సానుభూతిపరులైన యువకులు తెలుగు రాష్ట్రాల్లో నికృష్టమైన చేష్టలను కొనసాగిస్తున్నారని వాళ్ళందరినీ ఏమాత్రం పట్టించుకోని అధికారులు, పోలీసులు, ప్రభుత్వాలు సాధారణ ప్రజలు అనేసరికి వెంటాడి, వెంటాడి వేధిస్తూ చిత్రహింసలు పెడుతున్నారని గుర్తు చేశారు.ఏ నాయకుడి హంగామైనా అధికారం ఉన్నంత కాలమేనని అధికారం చేజారిన రోజున తన చుట్టూ తిరుగుతున్న నాయకులే పట్టించుకోరన్న సంగతిని మర్చిపోవద్దన్నారు.ఏ పార్టీలో ఉన్న అందరు మనవాళ్లే అనుకొని యువత జీవితాలను సన్మార్గంలో పెట్టడానికి ప్రభుత్వం తరపున ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని యువతకు కావలసిన ఉద్యోగ సదుపాయాలను భవిష్యత్తు నిర్మాణానికి సంబంధించిన సదుపాయాలను కల్పిస్తూ ఆదుకోవాలని అన్నిటికన్నా మించి యువతపై పగబడుతూ పోలీస్ అధికారులచే విపరీతంగా కొట్టించడం ఇకనైనా మానుకోవాలని గుర్తు చేస్తూ నాయకుల అనుచరులు కొనసాగిస్తున్న అక్రమాలపై రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు నిఘా విభాగాలు ప్రత్యేకమైన దృష్టిని పెట్టాయన్న సంగతిని మర్చిపోవద్దన్నారు. పేద యువతకు సహాయపడండి అంటూ ప్రభుత్వాలకు గుర్తు చేశారు.

# ఇతడే... నా భర్త విజయ్ దేవరకొండ: రష్మిక మందన్న

**ఒక్కటైన టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న**
**తమ పెళ్లి ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్న రష్మిక**
**విజయ్‌ను 'నా భర్త'గా పరిచయం చేస్తూ భావోద్వేగ పోస్ట్**
**ఏళ్లుగా సాగుతున్న ప్రేమ ప్రచారానికి శుభం కార్డు**
**విజయ్ వల్లే తాను కలలుగన్న మహిళగా మారానన్న నటి**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

కొన్నేళ్లుగా సాగుతున్న ప్రేమ ప్రయాణానికి అధికారికంగా ముగింపు పలుకుతూ, సినీ అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న శుభవార్తను నటి రష్మిక మందన్న స్వయంగా ప్రకటించారు. తన ప్రియుడు, స్టార్ హీరో విజయ్ దేవరకొండతో ఏడడుగులు నడిచానని, ఇకపై అతడే తన భర్త అని ప్రపంచానికి పరిచయం చేశారు. తమ సంప్రదాయ వివాహ వేడుకకు సంబంధించిన అందమైన ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకుంటూ, విజయ్‌పై తనకున్న ప్రేమను అక్షర రూపంలో ఆవిష్కరించారు. ఈ పోస్ట్ క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "హాయ్ మై లవ్స్.. ఇప్పుడు మీకు నా భర్తను పరిచయం చేస్తున్నాను! మిస్టర్ విజయ్ దేవరకొండ!!" అంటూ రష్మిక తన సుదీర్ఘ పోస్ట్‌ను ప్రారంభించారు. "నిజమైన ప్రేమంటే ఎలా ఉంటుందో, మనతో మనం ప్రశాంతంగా ఉండటం ఎలాగో నాకు నేర్పించిన వ్యక్తి ఇతడే. పెద్ద కలలు కనడం సరైందేనని, నేను ఊహించిన దానికంటే ఎక్కువే సాధించగలనని ప్రతిరోజూ నాకు గుర్తుచేస్తూ, నిరంతరం ప్రోత్సహించిన వ్యక్తి" అని విజయ్ తన జీవితంలో పోషించిన పాత్రను వివరించారు. అతడి గురించి ఓ పుస్తకమే రాయొచ్చని చమత్కరించారు. ఓ మహిళగా నేను ఎలా ఎదగాలని అనుకున్నానో, ఆ విధంగా మారగలిగానంటే అందుకు విజయ్ నే కారణమని స్పష్టం చేశారు. "అందరిముందు డ్యాన్స్ చేయకుండా నన్ను ఎప్పుడూ ఆపలేదు. స్నేహితులతో కలిసి ప్రయాణం చేయడం ఎంత అద్భుతంగా ఉంటుందో చూపించాడు. నేను ఈ రోజు ఇలా ఉన్నానంటే, దాని వెనుక ఉన్నది అతడే. నేను నిజంగా ఆశీర్వదించబడ్డాను" అని పేర్కొన్నారు. తన జీవితంలోని ప్రతీ ఘట్టానికి ఇప్పుడు ఓ అర్థం వచ్చిందని రష్మిక భావోద్వేగంతో తెలిపారు. "ఇప్పుడు నా విజయాలు, కష్టాలు, సంతోషం, బాధ, ఆనందం.. నా జీవితంలోని ప్రతిదీ మరింత అర్థవంతంగా మారింది. ఎందుకంటే వాటన్నింటికీ సాక్షిగా, అందులో అతిపెద్ద భాగంగా నువ్వు నా పక్కన ఉన్నావు" అని రాసుకొచ్చారు. విజయ్‌తో కొత్త జీవితాన్ని ప్రారంభించడంపై తన ఉత్సాహాన్ని దాచుకోలేకపోయారు. "నీ భార్యగా మారడానికి, నీ భార్య అని పిలిపించుకోవడానికి నేను చాలా చాలా చాలా ఎగ్జైటింగ్‌గా ఉన్నాను. ఇక ఫుల్ పార్టీ టైమే!! మనం కలిసి అత్యద్భుతమైన జీవితాన్ని గడుపుదాం! ఐ లవ్ యూ" అంటూ తన పోస్ట్‌ను ప్రేమగా ముగించారు. రష్మిక షేర్ చేసిన ఈ ఫెయిరీ టేల్ వెడ్డింగ్ ఫొటోలు చూసి అభిమానులు, సినీ ప్రముఖులు కొత్త జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# కేటీఆర్, హరీశ్‌రావువి అన్నీ అబద్ధాలే

**కాళేశ్వరం వైఫల్యాలపై మంత్రి పొంగులేటి**
**ప్రాజెక్టులపై కేటీఆర్, హరీశ్ వ్యాఖ్యలు వాస్తవ దూరమన్న పొంగులేటి**
**లక్ష కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యమని విమర్శ**
**రాష్ట్ర నీటి ప్రయోజనాల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని వ్యాఖ్య**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పేరుతో అవకతవకలు జరిగాయంటూ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. లక్ష కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యమని విమర్శించారు. ప్రాజెక్టులపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవ దూరమని, ప్రజలను తప్పుదోవ పట్టించడమే వారి లక్ష్యమని ఆయన ఆక్షేపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును రూ. 1.08 లక్షల కోట్ల అంచనాతో నిర్మించి, కేవలం 110 టీఎంసీల నీటిని మాత్రమే అందుబాటులోకి తీసుకురావడం గత పాలకుల అసమర్థతకు నిదర్శనమని పొంగులేటి మండిపడ్డారు. ఎన్నికలకు ముందే బ్యారేజీలు కుంగిపోయాయని అన్నారు. ఆ తప్పిదాల నుంచి తప్పుకోవడానికే ఇప్పుడు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే బీఆర్ఎస్, బీజేపీల మధ్య 'ఫెవికాల్ బంధం' ఉందన్న విషయం బహిరంగ రహస్యమేనని, అందుకే వారు ఒకరికొకరు సహకరించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర నీటి ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం సలహాలు ఇవ్వాల్సింది పోయి, కేవలం రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం దురదృష్టకరమని పొంగులేటి అన్నారు. తెలంగాణ హక్కుల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పోరాడుతుందని, గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది రైతులకు మేలు చేకూర్చడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన వెల్లడించారు.

# జగన్ చేతకానితనం వల్లే సీమ లిఫ్ట్ ఆగింది: టీడీపీ మంత్రుల ధ్వజం

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

శాసనమండలిలో రాయలసీమ ఎత్తిపోతల పథకం (రాయలసీమ లిఫ్ట్) అంశంపై అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే నిలిచిపోయిన ఈ ప్రాజెక్టుపై ఇప్పుడు తమను ప్రశ్నించడం ఏంటని కూటమి ప్రభుత్వ మంత్రులు వైసీపీ సభ్యులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నాలుగేళ్ల పాటు ఆగిపోయిన పనులకు సమాధానం చెప్పకుండా, ఇప్పుడు ప్రభుత్వంపై బురద చల్లడమేంటని నిలదీశారు. ఈ సందర్భంగా మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వైసీపీ తీరును తీవ్రంగా ఎండగట్టారు. "రాయలసీమ లిఫ్ట్ పనులు 2020లోనే జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాలతో ఆగిపోయాయి. ఈ విషయాన్ని నాటి తెలంగాణ మంత్రి హరీశ్ రావు స్వయంగా ప్రకటించారు. అలాంటప్పుడు, నాలుగేళ్లుగా అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం ఏం చేసింది? కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయకుండా నిర్లక్ష్యం వహించింది మీ అసమర్థత కాదా?" అని పయ్యావుల కేశవ్ ప్రశ్నించారు. "రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో వైసీపీ ప్రభుత్వం సీమకు 1 శాతం నిధులు కూడా ఖర్చు చేయలేదు. కానీ, మేం హంద్రీనీవా పనులు పూర్తి చేసి 190 రోజుల్లోనే 44 టీఎంసీల నీటిని తరలించాం. ప్రస్తుతం రాయలసీమ ప్రాజెక్టుల్లో 366 టీఎంసీల నీటిని నిల్వ చేశాం. ఇది మా నాయకుడు చంద్రబాబు సమర్థతకు నిదర్శనం" అని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం 20 నెలల్లోనే రూ.8 వేల కోట్లు ఖర్చు చేసిందని, తాజా బడ్జెట్‌లో మరో రూ.10,014 కోట్లు కేటాయించిందని వివరించారు. వైసీపీ ప్రభుత్వం జీఓ 365 తెచ్చి 102 సాగునీటి ప్రాజెక్టులను రద్దు చేసిందని, గోరుకల్లు, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించిందని మంత్రులు ఆరోపించారు.

# ఏపీ మద్యం స్కాంలో కీలక పరిణామం..

## సిట్ ముందు లొంగిపోయిన ముప్పిడి అవినాశ్ రెడ్డి

**ఏపీ మద్యం కుంభకోణం కేసులో నిందితుడు అవినాశ్ రెడ్డి**
**సిట్ ముందు లొంగుబాటు**
**సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇవాళ లొంగిపోయిన అవినాశ్ రెడ్డి**
**వైసీపీ హయాంలో జరిగిన రూ.3,500 కోట్ల స్కాంలో**
**ఈయన ఏ7 నిందితుడు**
**ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ నేతృత్వంలో కొనసాగుతున్న**
**సిట్ దర్యాప్తు**


**విజయవాడ, జై భీమ్ న్యూస్**

ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏడో నిందితుడిగా ఉన్న ముప్పిడి అవినాశ్ రెడ్డి ఇవాళ విజయవాడలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఎదుట లొంగిపోయారు. ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించి, ఈ నెల 26లోగా లొంగిపోవాలని ఆదేశించిన రెండు రోజులకే ఆయన సిట్ విచారణకు హాజరయ్యారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, అవినాశ్ రెడ్డి కచ్చితంగా లొంగిపోయి దర్యాప్తునకు సహకరించాలని స్పష్టం చేసింది. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలన్న ఆయన అభ్యర్థనను తిరస్కరించింది. అయితే, ట్రయల్ కోర్టులో రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు స్వేచ్ఛనిచ్చింది. అంతకుముందు ఏపీ హైకోర్టు ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయడంతో అవినాశ్ రెడ్డి సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో (2019-24) ఎక్సైజ్ పాలసీని మార్చి, డిస్టిలరీల నుంచి ముడుపులు స్వీకరించడం ద్వారా సుమారు రూ.3,500 కోట్ల కుంభకోణం జరిగిందని ప్రధాన ఆరోపణ. మద్యం సరఫరాదారుల నుంచి కమీషన్ల రూపంలో వసూలు చేసిన డబ్బును అవినాశ్ రెడ్డి విదేశాలకు తరలించి మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని అభియోగాలు నమోదయ్యాయి. ఆయన దేశం విడిచి పారిపోయాడని, ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి ఇందుకు సహకరించాడని ప్రాసిక్యూషన్ గతంలో కోర్టుకు తెలిపింది. 2024లో టీడీపీ-ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కుంభకోణంపై కేసు నమోదైంది. తొలుత ఎక్సైజ్ శాఖ అధికారి ఫిర్యాదుతో సీఐడీ దర్యాప్తు ప్రారంభించగా, తర్వాత ప్రభుత్వం కేసును లోతుగా విచారించేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కేసులో ఐపీసీ, అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద మంగళగిరి సీఐడీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వైసీపీ నేతలు తమకు అనుకూలమైన నూతన మద్యం పాలసీని ప్రోత్సహించి, కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టి, డిస్టిలరీ కంపెనీల నుంచి ముడుపులు స్వీకరించారని, తద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం కలిగించారని సిట్ దర్యాప్తులో తేలినట్లు సమాచారం. ఈ కేసులో పలువురు ఎంపీలు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, డిస్టిలరీ కంపెనీల యజమానులను కూడా సిట్ నిందితులుగా చేర్చింది. అవినాశ్ రెడ్డి లొంగుబాటుతో ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉంది.

# ఐపీఎస్ సునీల్ నాయక్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్

**రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు**
**బీహార్ కేడర్ ఐపీఎస్ సునీల్ నాయక్‌కు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసిన గుంటూరు కోర్టు**
**సునీల్ నాయక్ కోసం పాట్నాలోనే మకాం వేసిన ఏపీ పోలీసులు**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**



ఆంధ్రప్రదేశ్ రాజకీయ, పోలీస్ వర్గాల్లో ప్రకంపనలు సృష్టించిన రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసు సరికొత్త మలుపు తిరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌కు సంబంధించి గుంటూరు న్యాయస్థానం అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. గత కొంతకాలంగా విచారణకు గైర్హాజరవుతున్న సునీల్ నాయక్‌పై నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ప్రస్తుతం బీహార్‌లో ఐజీగా విధులు నిర్వర్తిస్తున్న నాయక్‌ను తీసుకొచ్చేందుకు ఏపీ పోలీసులు ఇప్పటికే పాట్నాలో పాగా వేశారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ రఘురామను అరెస్ట్ చేసిన సమయంలో, కస్టడీలో ఆయనపై అమానుషంగా భౌతిక దాడి జరిగిందన్న ఆరోపణలపై నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా పోలీసులు నిన్న కోర్టులో వారెంట్ పిటిషన్ దాఖలు చేయగా, నిందితుడి సహాయ నిరాకరణను పరిగణనలోకి తీసుకున్న కోర్టు తక్షణమే అరెస్ట్ వారెంట్‌కు పచ్చజెండా ఊపింది. అయితే, బీహార్‌లో సునీల్ నాయక్‌పై అరెస్ట్ ప్రక్రియ ఉత్కంఠకు దారితీస్తోంది. ఇప్పటికే ఏపీ పోలీసు బృందం పాట్నాలో ఆయనను అదుపులోకి తీసుకుని, ఏపీకి తీసుకొచ్చేందుకు అక్కడి కోర్టులో ట్రాన్సిట్ పిటిషన్ వేయగా... ఆ పిటిషన్ ను కోర్టు తిరస్కరించింది. అంతేకాదు, నెల రోజుల పాటు ఆయనపై ఎలాంటి చర్యలు కూడా తీసుకోవద్దని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన ఎవరికీ అందుబాటులో లేకుండా ఉన్నట్టు సమాచారం. తాజాగా గుంటూరు కోర్టు సునీల్ నాయక్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసిన నేపథ్యంలో, ఏపీ పోలీసులు మరింత పకడ్బందీగా అడుగులు వేస్తున్నారు. ఆ ఐపీఎస్ అధికారిని పట్టుకునేందుకు బీహార్ పోలీస్ యంత్రాంగం సహకారం కోరుతూ, వీలైనంత త్వరగా ఆయనను గుంటూరు కోర్టులో ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు.

# కాకతీయ యూనివర్సిటీ భూముల పరిరక్షణకు ఏబీవీపీ సంతకాల సేకరణ





**హన్మకొండ, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కాకతీయ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం విస్తృత స్థాయిలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని యూనివర్సిటీ ఆస్తుల రక్షణకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ యూనివర్సిటీ అధ్యక్షుడు హరికృష్ణ, కార్యదర్శి మేకల జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ, సీఆర్పీఎఫ్ బెటాలియన్ వారు వదిలి వెళ్లిన యూనివర్సిటీ భూమిని తక్షణమే తిరిగి యూనివర్సిటీకి అప్పగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనివర్సిటీకి చెందిన విలువైన భూములు కబ్జాలకు గురికాకుండా వెంటనే ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని, అక్రమ ఆక్రమణలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. యూనివర్సిటీ ఆస్తులను కాపాడటం ప్రతి విద్యార్థి బాధ్యత అని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా భూముల పరిరక్షణ కోసం ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కులు, యూనివర్సిటీ ఆస్తుల రక్షణ కోసం ఏబీవీపీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఇంచార్జ్ డాక్టర్ నిమ్మల రాజేష్, సాయి, అఖిల్, రజనీకాంత్, ప్రణయ్, మహేందర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ విశ్వవిద్యాలయంలో జాతీయ సదస్సు ఘనారంభం






**"మానవ సంక్షేమం-సుస్థిర అభివృద్ధే వికసిత్ భారత్ లక్ష్యం"**

**వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి**

**హన్మకొండ, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

"మానవ సంక్షేమం, సమగ్ర అభివృద్ధి, సుస్థిర ప్రగతే దేశ లక్ష్యాలు కావాలి" అని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం విశ్వవిద్యాలయ సెనేట్ హాల్‌లో సోషల్ సైన్సెస్, ఆర్ట్స్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు "ఇంటిగ్రేటింగ్ ఎస్‌డీజీస్ ఫర్ వికసిత్ భారత్ ఏ 2047: అచీవ్‌మెంట్స్ అండ్ పాత్‌వేస్" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సదస్సుకు సోషల్ సైన్సెస్, ఆర్ట్స్ విభాగాల డీన్ ఆచార్య బి. సురేష్ లాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ, పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, సమగ్ర వైద్య సేవలు, వివక్ష నిర్మూలన వంటి అంశాలపై దృష్టి పెట్టడం ద్వారానే "వికసిత్ భారత్ ఏ 2047" లక్ష్యం సాధ్యమవుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా అనేక పథకాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. 2047 నాటికి భారత్ ప్రపంచ అగ్రస్థానంలో నిలవాలని, తెలంగాణ రాష్ట్రం "రైజింగ్ తెలంగాణ" దిశగా 2030 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నదని వివరించారు. దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మానవ ప్రవర్తనలో మార్పులు అవసరమని, హరిత విప్లవం, నీలి విప్లవం, ఆర్థిక సంస్కరణల ద్వారా దేశంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. సుస్థిర ఆర్థిక వ్యవస్థ నిర్మాణం తరగతి గది నుంచే ప్రారంభం కావాలని, సేంద్రీయ వ్యవసాయం, ఆరోగ్యకరమైన ఆహారం వైపు మలుపు తిప్పాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధస్సు విస్తరిస్తున్న నేపథ్యంలో అధ్యాపకులు సంప్రదాయ బోధన విధానాల నుంచి అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ వైపు అడుగులు వేయాలని సూచించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ యువత మార్పుకు ఏజెంట్లు కావాలని, మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సోషియాలజీ విభాగాధిపతి ఆచార్య ఎం. స్వర్ణలత పీపుల్, ప్రాస్పెరిటీ, ప్లానెట్, పార్టనర్షిప్,ౢాముఎవ అనే ఐదు సూత్రాలే అభివృద్ధి ప్రాతిపదిక కావాలని పేర్కొన్నారు. తెలుగు విభాగాధిపతి డా. ఎం. లింగయ్య విద్య, వైద్యం ప్రాధాన్యతతోనే మెరుగైన భారత్ సాధ్యమన్నారు. పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డా. సంకినేని వెంకటయ్య ఆర్థికాభివృద్ధి--సామాజిక అభివృద్ధి--పర్యావరణ పరిరక్షణ సమన్వయం అవసరమని అన్నారు. చరిత్ర విభాగాధిపతి డా. చిలువేరు రాజ్‌కుమార్ కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతను మరింతగా నిర్వర్తించాలని సూచించారు. జర్నలిజం విభాగాధిపతి డా. సంగాని మల్లేశ్వర్ కనీస సదుపాయాల కల్పనతో పాటు కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం కీలకమన్నారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డా. ఆకుతోటి శ్రీనివాసులు ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రజల భాగస్వామ్యం అత్యవసరమన్నారు. ఇంగ్లీష్ విభాగాధిపతి డా. ఆర్. మేఘనా రావు ఆధ్వర్యంలో వెలువడుతున్న జర్నల్‌లో సుస్థిర అభివృద్ధిపై ప్రముఖుల వ్యాసాలు ప్రచురించబడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక సంచిక "కాకతీయ యూనివర్సిటీ జర్నల్ ఆఫ్ ఇంగ్లీష్ స్టడీస్" ను ఆవిష్కరించారు. లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి డా. బి. రాధికా రాణి ఎస్‌డీజీలపై సుమారు 100 వ్యాసాలతో "కాకతీయ జర్నల్ ఆఫ్ సోషల్ సైన్సెస్" ప్రత్యేక సంచికను విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు ఆచార్య ఎం. విద్యాసాగర్ రెడ్డి, పాలక మండలి సభ్యులు డా. బి. రమ, డా. చిర్రా రాజు తదితరులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన, వందేమాతరం గీతంతో సభ ఘనంగా ప్రారంభమైంది.

# హనుమకొండలో ఘనంగా సీతారామచంద్ర ప్రసన్నాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

**పుష్పయాగంలో పాల్గొన్న వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య**

**హన్మకొండ, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**





బాలసముద్రం, ఏకశిలాపార్కు సమీపంలోని లో ద్విపుష్కర ప్రయుక్త పట్టాభిషేకోత్సవాత్మక పంచాహ్నిక పుష్కర బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆధ్యాత్మిక ఉత్సాహం నడుమ జరుగుతున్న ఈ ఉత్సవాల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల భాగంగా నిర్వహించిన పుష్పయాగ కార్యక్రమం భక్తి పరవశంతో సాగింది. ఆలయ ప్రాంగణం పూలతో అలంకరించబడగా, వేదమంత్రోచ్చారణల నడుమ యాగశాలలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీ డా. కడియం కావ్య స్వామివారికి పుష్పార్చనలు సమర్పించి, దేవాలయ అభివృద్ధి కోసం ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ ఆధ్యాత్మికత సమాజానికి మానసిక శాంతిని, ఐక్యతను అందిస్తుందని పేర్కొన్నారు. ఇటువంటి పుష్కర బ్రహ్మోత్సవాలు ప్రజల్లో సద్భావనను పెంపొందించడమే కాకుండా, సాంప్రదాయ విలువలను తరతరాలకు చాటి చెప్పే వేదికలుగా నిలుస్తాయని అన్నారు. శ్రీ సీతారామచంద్ర ప్రసన్నాంజనేయస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, సమృద్ధి కలగాలని ఆకాంక్షించారు. సంప్రదాయ ఉత్సవాలను సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవి, ఆలయ కమిటీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు స్వాతి, ఉమా తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసి, భక్తి గీతాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయాయి. పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు మరికొన్ని రోజుల పాటు కొనసాగనున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష



**వరంగల్ జిల్లా/గీసుగొండ, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేట హవేలీలోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం పలు శాఖల అధికారులతో కలిసి సందర్శించి, పార్క్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పార్క్‌లో జరుగుతున్న రహదారుల నిర్మాణం, రైల్వే ఓవర్ బ్రిడ్జ్ మరియు ఇతర బ్రిడ్జ్ పనులు, గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నుండి టెక్స్టైల్ పార్క్‌కు రహదారి మార్గం ఏర్పాటు, విద్యుత్ సరఫరా, తాగునీటి వసతి వంటి మౌలిక సదుపాయాల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పనుల నాణ్యత, వేగం, సమయపాలనపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పార్క్ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తైతే పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఏర్పడి, స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కలుగుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మౌలిక సదుపాయాల అభివృద్ధిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సుమ, జిల్లా పరిశ్రమల మేనేజర్ స్వామి, ఆర్ అండ్ బి శాఖ అధికారులు, నేషనల్ హైవేస్ అథారిటీ ప్రతినిధులు, తహసీల్దార్లు రాజ్‌కుమార్, రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ పోలీస్ కమీషనరేట్ లో నూతన పోలీస్ జాగిలాలు విధుల్లోకి



**వరంగల్, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

నేర పరిశోధనలో పోలీస్ జాగిలాల పాత్ర కీలకమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో ఎనిమిది నెలల శిక్షణ పూర్తి చేసుకున్న బీగల్ జాతికి చెందిన "భైరవ్", "విరాట్" జాగిలాలు తాజాగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో విధుల్లోకి చేరాయి. ఈ సందర్భంగా కమిషనర్ జాగిలాల పనితీరును పరిశీలించి, వాటి సామర్థ్యాలపై హ్యాండ్లర్లు కుమారస్వామి (భైరవ్), సాంబయ్య (విరాట్)లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. శిక్షణలో నిర్వహించిన క్లిష్ట పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన భైరవ్ జాగిలానికి గోల్డ్ మెడల్ లభించగా, కమిషనర్ స్వయంగా మెడల్ అలంకరించి హ్యాండ్లర్‌ను అభినందించారు. చిన్న ఆకారంలో ఉండే బీగల్ జాగిలాలు సన్నని ప్రదేశాల్లో సులభంగా ప్రవేశించి ప్రేలుడు పదార్థాలను గుర్తించగలవని కమిషనర్ తెలిపారు. ముఖ్యంగా విమానాల్లో ప్రయాణికుల సామాను నిల్వ చేసే క్యాబిన్లలో, వాహనాల క్రింది భాగాల్లో తనిఖీలు నిర్వహించడంలో ఇవి ప్రత్యేక శిక్షణ పొందాయని చెప్పారు. గతంలో కూడా కమిషనరేట్ పరిధిలో జరిగిన పలు కేసుల్లో పోలీస్ జాగిలాల సహకారంతో నిందితులను గుర్తించడం, మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకోవడం వంటి విజయాలు సాధించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు శ్రీనివాస్, రవి, ఏసీపీ సురేంద్ర, ఆపరేషన్స్ ఆర్ఐ సింహాచలం శ్రీనివాస్, డాగ్ స్క్వాడ్ ఇంచార్జ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. నూతన జాగిలాల చేరికతో నగర భద్రత మరింత బలోపేతం కానుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

**నేడు భద్రకాళి బండ్ వద్ద "రుద్రమ--1" రాకెట్ ట్రయల్ రన్**

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

**హన్మకొండ, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రకాళి బండ్ ప్రామినాడ్ వద్ద నిర్వహించనున్న "రుద్రమ--1" రాకెట్ ప్రయోగానికి ముందు ట్రయల్ రన్‌ను శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. గురువారం సాయంత్రం హనుమకొండ కుడా కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, విద్యా, కుడా, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాకెట్ రూపకర్త శశాంక్ భూపతి, ఎన్ఐటి ప్రొఫెసర్ అంజన్ కుమార్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈనెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా భద్రకాళి బండ్ పై రాకెట్ లాంచింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సదుపాయాలు, ప్రజల రాకపోకలు, అత్యవసర సేవలు, సమన్వయ విధానాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ప్రజల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వివరాల ప్రకారం, 28వ తేదీ సాయంత్రం 5:30 గంటలకు రాకెట్ లాంచింగ్ కార్యక్రమం నిర్వహించను న్నారు. అదే రోజు మధ్యాహ్నం 2:30 నుండి 4:30 గంటల వరకు కాళోజీ కళాక్షేత్రంలో శాస్త్ర విజ్ఞాన సదస్సు జరగనుంది. ఈ సదస్సులో ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా ఫౌండర్ సెక్రటరీ, డైరెక్టర్ ఎన్. రఘునందన్ కుమార్, ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ శేషగిరిరావు వెల్లంకి రాకెట్ ప్రయోగంపై ప్రసంగించనున్నారు. భద్రకాళి బండ్ ప్రామినాడ్ వద్ద రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు సాయంత్రం 4 గంటల నుంచి విద్యార్థులు, శాస్త్ర విజ్ఞాన ఆసక్తి గల ప్రజలకు ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఈవో గిరిరాజు గౌడ్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, పోలీస్, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# ఘనంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

**కాజీపేట, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట నారాయణ పాఠశాలలో విద్యార్థుల నాయకత్వ లక్షణాలను వెలికితీసే ఉద్దేశంతో "స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులే ప్రధాన పాత్ర పోషిస్తూ తమ విద్యా పురోగతిని, అభ్యాస విధానాలను, ప్రాజెక్టు పనులను తల్లిదండ్రుల సమక్షంలో స్వయంగా వివరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సమావేశానికి నారాయణ కేంద్ర అధ్యయన అభివృద్ధి విభాగానికి చెందిన స్వాతిలక్ష్మి, వరంగల్ జోనల్ డీజీఎం రిజ్వానా ఇమ్రాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వాతిలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను లోతుగా అర్థం చేసుకుని, వాటిని స్పష్టంగా వ్యక్తపరచగల సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, బాధ్యతా భావం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అభివృద్ధి చెందేందుకు స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థి తన వ్యక్తిగత విద్యా ప్రగతి నివేదిక, సబ్జెక్ట్ వారీగా సాధించిన ఫలితాలు, ప్రాజెక్ట్ కార్యకలాపాలు, సహపాఠ్య కార్యక్రమాలలో పాల్గొనడం



వంటి అంశాలను ప్రెజెంటేషన్ రూపంలో వివరించారు. తల్లిదండ్రులు ఆసక్తిగా వీక్షిస్తూ పిల్లల ప్రతిభను అభినందించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల అభ్యాస శైలి, మెరుగుదల అవసరమైన అంశాలపై తల్లిదండ్రులకు సూచనలు అందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ తేజావత్ అనిత మాట్లాడుతూ విద్యార్థి కేంద్రిత విద్యా విధానాన్ని అమలు చేయడంలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు నేర్చుకున్న విషయాలను స్వయంగా వివరిస్తే వారి లోపాలు, బలాలు వారికి స్పష్టంగా అవగతమవుతాయని, దీని ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్లు ఆకుల సాయికృష్ణ, శ్యామల, శిరీష, వైస్ ప్రిన్సిపాళ్లు అనూష, మౌనిక, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభ, నాయకత్వ గుణాలు ప్రతిఫలించిన ఈ స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ పాఠశాలలో ఉత్సాహభరిత వాతావరణాన్ని నెలకొల్పింది.

## కుటుంబ క్షేమం కోసం మద్యం సేవించి వాహనం నడపొద్దు

ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ







**వరంగల్, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

వాహనదారులు తమ కుటుంబ క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మద్యం సేవించి వాహనం నడపవద్దని వరంగల్ ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ సూచించారు. "ఆరైవ్ అలైవ్" రెండవ విడత కార్యక్రమంలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వాహనదారులకు కమిషనరేట్ కార్యాలయంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ కేంద్రంలో కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్లపై జరిగే ప్రమాదాలకు మన నిర్లక్ష్యం ప్రధాన కారణమవుతుందని హెచ్చరించారు. వాహనం నడిపే సమయంలో స్వీయ రక్షణతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా హత్యల కన్నా రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య అధికంగా నమోదవుతోందని తెలిపారు. ఈ ప్రమాదాల్లో చాలా వరకు మద్యం మత్తులో వాహనం నడపడం ప్రధాన కారణమని పోలీసులు గుర్తించారని చెప్పారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల డ్రైవర్‌తో పాటు రోడ్డుపై నడిచే పాదచారులు, ఇతర వాహనదారులు కూడా ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో ఇంటి యజమాని మరణిస్తే ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని, అనేక కుటుంబాలు దీనస్థితిలో జీవితాన్ని కొనసాగిస్తున్న ఉదాహరణలు ఉన్నాయని ఏసిపి పేర్కొన్నారు. అందువల్ల డ్రైవింగ్ సమయంలో మద్యం సేవించడం పూర్తిగా మానుకోవాలని, సీటుబెల్ట్ ధరించడం, హెల్మెట్ వినియోగించడం వంటి రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి, ట్రైనింగ్ సెంటర్ ఎస్ఐ నారాయణ తదితరులు పాల్గొన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం చట్టపరమైన నేరమేకాక, కుటుంబాల భవిష్యత్తును ప్రమాదంలో పడేసే చర్య అని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

## బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను అధిగమించాలి

జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్



**ములుగు, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

బ్యాంకులకు ప్రభుత్వం నిర్దేశించిన రుణ లక్ష్యాలను కేవలం సాధించడం కాకుండా అధిగమించేందుకు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సిహెచ్ మహేందర్ జి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బ్యాంకర్ల జిల్లా సంప్రదింపుల కమిటీ (డి.ఎల్.సీ.సీ), జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో కలిసి బ్యాంకుల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ప్రాధాన్యతనిస్తూ బ్యాంకర్లు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. గ్రామాల్లోని నిరుపేద కుటుంబాలు బ్యాంకుల ద్వారా రుణాలు పొందేలా అవగాహన సమావేశాలు నిర్వహించి, ఆర్థికంగా ఎదగడానికి మార్గనిర్దేశం చేయాలని సూచించారు. నూతనంగా ఏర్పడుతున్న మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందించేందుకు అవసరమైన నూతన ఖాతాలను త్వరితగతిన ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా 60 సంవత్సరాలు నిండిన మహిళ వయోవృద్ధులతో ఏర్పాటు చేస్తున్న సంఘాలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ రుణ సహాయాలు అందించడంలో బ్యాంకర్లు ముందుండాలని కోరారు. అలాగే, నిరుద్యోగ యువత స్వయం ఉపాధి మరియు చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ పథకాల కింద దరఖాస్తు చేసిన వారికి నియమ నిబంధనల ప్రకారం సకాలంలో రుణాలు మంజూరు చేయాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి, లీడ్ బ్యాంకు మేనేజర్ జయప్రకాష్, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, ఆర్‌బీఐ ఏజీఎం యశ్వంత్ సాయి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం కమలాకర్‌లతో కలిసి 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రొటెక్షన్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కొమురయ్య, పరిశ్రమల శాఖ జీఎం సిద్ధార్థ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ధర్మ నాయక్, మత్స్య సంవర్ధక శాఖ అధికారి సాల్మన్ రాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్, హార్టికల్చర్ అధికారి సంజీవరావు, అడిషనల్ డీఆర్‌డీఏ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## కాకతీయ విశ్వవిద్యాలయం

మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ మధ్య ఎంఓయూ

విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి.. ఉపాధి అవకాశాల విస్తరణ



**హన్మకొండ, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం మరియు ప్రముఖ స్వచ్ఛంద సంస్థ మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ మధ్య విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు లక్ష్యంగా గురువారం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ ఒప్పందంపై విశ్వవిద్యాలయం తరఫున రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం, మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ తరఫున డిప్యూటీ జనరల్ మేనేజర్ (లైవ్‌లీహుడ్ ఆపరేషన్స్ -- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) డి. శేఖర్ బాబు సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా సామాజికంగా వెనుకబడిన మరియు ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన యువతకు నాణ్యమైన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ, కెరీర్ మార్గదర్శక కార్యక్రమాలు, ఉపాధి ఆధారిత శిక్షణ అందించబడనుంది. విద్యార్థుల భవిష్యత్ ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే దిశగా జాబ్ ఓరియెంటెడ్ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు, ప్లేస్‌మెంట్ సహాయం మేజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడతాయి. ఈ భాగస్వామ్యంలో భాగంగా డేటా ఎంట్రీ స్కిల్స్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, వెబ్ డెవలప్‌మెంట్, బ్యాంకింగ్, ఫైనాన్స్, డిజిటల్ మార్కెటింగ్, హార్డ్‌వేర్ నెట్‌వర్కింగ్ మరియు డిజిటల్ లిటరసీ వంటి సర్టిఫికేట్ కోర్సులు నిర్వహించబడతాయి. కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికేట్లు ప్రదానం చేయబడతాయి. ఈ ఒప్పందం 26 ఫిబ్రవరి 2026 నుండి 27 ఫిబ్రవరి 2027 వరకు ఒక సంవత్సరం కాలపరిమితి కలిగి ఉండగా, పరస్పర అంగీకారంతో పొడిగించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎస్. జ్యోతి, ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి, ఆచార్య ఎస్. నరసింహ చారి, స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఆచార్య మామిడాల ఇస్తారి, మేజిక్ బస్ ఫౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డి. శేఖర్ బాబు, ప్రోగ్రామ్ మేనేజర్ టీ. వెంకటరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రాజేష్ ల్యాడెల్ల తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా చాహత్ బాజ్ పాయ్ బాధ్యతల స్వీకారం - అధికారుల ఘన స్వాగతం

**హన్మకొండ, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా చాహత్ బాజ్ పాయ్ గురువారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె బాధ్యతలు చేపట్టి జిల్లా పరిపాలనను ముందుకు నడిపేందుకు సంకల్పం వ్యక్తం చేశారు. బాధ్యతలు స్వీకరించేందుకు కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకున్న నూతన కలెక్టర్‌కు జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణతో పాటు పలువురు విభాగాల జిల్లా అధికారులు, తహసిల్దార్లు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు, పూలమొక్కలు అందజేసి అభినందనలు తెలియజేశారు. అధికారుల సమక్షంలో కలెక్టర్ ఛాంబర్‌లో బాధ్యతల స్వీకార కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా అధికారులు జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాధాన్య ప్రాజెక్టులు, రెవెన్యూ, సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి వంటి విభాగాల పనితీరుపై సంక్షిప్తంగా వివరణ ఇచ్చినట్లు సమాచారం. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ పారదర్శక, ప్రజానుకూల పరిపాలన అందిస్తానని నూతన కలెక్టర్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఇంతకుముందు హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన స్నేహ శబరిష్ బదిలీపై మహబూబాబాద్ జిల్లాకు కలెక్టర్‌గా వెళ్లారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా సేవలందించిన చాహత్ బాజ్ పాయ్ ఇప్పుడు హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం జిల్లాలో పరిపాలనా పరంగా కొత్త దశకు నాంది పలికినట్లుగా భావిస్తున్నారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రభుత్వ పథకాల సమర్థ అమలు, పారదర్శకత, ప్రజలతో నేరుగా మమేకమయ్యే విధానానికి ప్రాధాన్యం ఇస్తూ పనిచేస్తానని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేసినట్లు అధికారులు తెలిపారు.

## ఆరోగ్యవంతమైన పిల్లలే - ఆరోగ్యవంతమైన సమాజం

ఎస్ఆర్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థుల ద

గ్రామీణ అవగాహన కార్యక్రమం





**హాసన్ పర్తి, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మడిపల్లి గ్రామంలో ఆరోగ్యం, పోషకాహారంపై విస్తృత అవగాహన కల్పించే లక్ష్యంతో ఎస్ఆర్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ అవగాహన అనుభవం (ఆర్ఎడబ్ల్యూఈపి) కార్యక్రమాన్ని నిర్వహించారు. "ఆరోగ్యవంతమైన పిల్లలే -- ఆరోగ్యవంతమైన సమాజం" అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామస్తులలో మంచి స్పందన పొందింది. కార్యక్రమానికి విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ జి. శ్రీకర్ రెడ్డి, డాక్టర్ రాథోడ్ లాల్, గ్రామ సర్పంచ్ బుర్ర రంజిత్, జెడ్పీహెచ్ఎస్ మడిపల్లి ప్రధానోపాధ్యాయులు జి. నర్సయ్య, బయో సైన్స్ ఉపాధ్యాయులు కె. రవీంద్రన్ తదితరులు హాజరయ్యారు. సభను ఉద్దేశించి మాట్లాడిన వారు సమతుల్య ఆహారం, శుభ్రత, తాగునీటి పరిశుభ్రత, పిల్లలలో రక్తహీనత నివారణ, పండ్లు--కూరగాయల వినియోగం వంటి అంశాలపై ప్రాముఖ్యతను వివరించారు. చిన్న వయస్సు నుంచే సరైన పోషకాహారం అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక వికాసం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చివరి సంవత్సరం ఆర్ఎడబ్ల్యూఈపి విద్యార్థులు గ్రామంలోని పాఠశాల విద్యార్థులతో పరస్పర చర్చలు నిర్వహించి, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాయామం అవసరం వంటి విషయాలను సరళంగా వివరించారు. గ్రామస్తులు కూడా చురుకుగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం విద్యార్థులు గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించి ఆరోగ్యంపై నినాదాలు చేస్తూ ప్రజలకు సందేశాన్ని చేరవేశారు. "పిల్లల ఆరోగ్యం -- దేశానికి బలమైన భవిష్యత్", "పోషకాహారం -- ఆరోగ్యానికి ఆధారం" వంటి నినాదాలతో గ్రామంలో అవగాహన కల్పించారు. కార్యక్రమం ద్వారా గ్రామస్థుల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించడం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. సమగ్ర ఆరోగ్య సంరక్షణకు విద్యార్థుల భాగస్వామ్యం అభినందనీయమని గ్రామ పెద్దలు ప్రశంసించారు.

## మీడియా అక్రిడిటేషన్ల కోసం జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు

**హన్మకొండ, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**





జిల్లాలోని మీడియా ప్రతినిధులకు 2026-28 సంవత్సరాలకు కొత్త అక్రిడిటేషన్లు జారీ చేయడానికి నూతన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 252 ప్రకారం కమిటీ సభ్యత్వానికి అర్హులైన ప్రతినిధుల పేర్లను సంబంధిత మీడియా అసోసియేషన్లు, సంఘాలు తమ సంస్థల ఒరిజినల్ లెటర్ ప్యాడ్‌పై సిఫారసు చేస్తూ ఫిబ్రవరి 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోపు జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, హనుమకొండలో సమర్పించాలని సూచించారు. కమిటీలో బిగ్ తెలుగు డైలీ, ఉర్దూ డైలీ, మీడియం డైలీ, స్మాల్ డైలీ నుంచి ఒక్కొక్కరు, ఎలక్ట్రానిక్ మీడియా నుంచి ఒకరు, వీడియో జర్నలిస్ట్ నుంచి ఒకరు, ఫోటో జర్నలిస్ట్ నుంచి ఒకరు సభ్యులుగా ఎంపిక చేయబడతారు. జి.ఓ 252లోని రూల్ 3, సబ్ రూల్ 1(సి) ప్రకారం అభ్యర్థులు ఫుల్ టైం జర్నలిస్టులై ఉండాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాత్రమే దరఖాస్తు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బిగ్ డైలీ, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు కనీసం 10 సంవత్సరాల అనుభవం ఉండాలి. మిగతా వర్గాల ప్రతినిధులకు కనీసం 5 సంవత్సరాల మీడియా అనుభవం తప్పనిసరి అని పేర్కొన్నారు. జిల్లాలో పారదర్శకంగా అక్రిడిటేషన్ల జారీ కోసం ఈ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా యంత్రాంగం వెల్లడించింది.

# ఇందిరమ్మ ఇళ్లలో రాష్ట్రంలోనే మొదటి స్థానం లక్ష్యం

**సాగునీటిపై రాజీ లేదు: ఎమ్మెల్యే కడియం శ్రీహరి**





**జనగామ జిల్లా, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సాగునీటి అంశాలపై జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్‌తో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. జనగామ జిల్లా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలవడం, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో ఉండడం పట్ల ఎమ్మెల్యే అధికారులను అభినందించారు. అయితే ఇకపై రాష్ట్రంలోనే మొదటి స్థానాన్ని లక్ష్యంగా పెట్టుకొని పని చేయాలని సూచించారు. మండలాల వారీగా మార్క్‌అవుట్ ఇచ్చి పనులు ప్రారంభం కాని ఇండ్ల వివరాలు సేకరించాలని, వారం రోజుల్లో పనులు ప్రారంభించని లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చి అవసరమైతే రద్దు చేయాలని హెచ్చరించారు. "ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఒక్క ఇల్లు కూడా ల్యాప్స్ కావద్దు" అని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో రెండో విడతగా సుమారు 3,500 ఇళ్లు మంజూరు అయ్యే అవకాశం ఉందని, ఈ విడతలో సొంత స్థలం లేని వారికి ఇంటి స్థలంతో పాటు ఇల్లు కల్పించాల్సి ఉంటుందని తెలిపారు. అందుకోసం తహసీల్దార్లు మండలాల వారీగా ప్రభుత్వ స్థలాల లభ్యత, భూ సేకరణ పరిస్థితులపై పూర్తి వివరాలు సేకరించాలని, ఒక ఎకరంలో ఎంతమందికి ఇళ్ల పట్టాలు ఇవ్వవచ్చో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మార్చి 15న ఆర్డీవోలు, తహసీల్దార్లతో మరో సమీక్షా సమావేశం నిర్వహిస్తామని, పూర్తి స్థాయి వివరాలతో హాజరు కావాలని సూచించారు. సాగునీటి అంశంపై ఎమ్మెల్యే కఠినంగా స్పందించారు. "సాగు నీరు అందక ఒక్క ఎకరం కూడా ఎండిపోవడానికి వీలు లేదు. ఒక్క ఎకరం ఎండినా సంబంధిత అధికారులదే బాధ్యత" అని హెచ్చరించారు. గోదావరి జలాలు సమృద్ధిగా ఉన్నందున మార్చి చివరి వరకు లిఫ్టింగ్ కొనసాగించాలని, రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బొమ్మకూరు కాలువలో పూడికతీత, చెట్ల తొలగింపు పనులు వారం రోజుల్లో పూర్తి చేసి మంగలి బండ తండా వరకు నీరు అందించాలని ఆదేశించారు. జఫర్‌గడ్ మండలం హిమ్మత్‌నగర్ వరకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని, కాలువ పనులకు ఎస్‌డీఎఫ్ నుంచి రూ.5 లక్షలు మంజూరు చేస్తానని తెలిపారు. ఈజీఎస్ నిధుల వినియోగంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. మార్చి 21 నాటికి పనులు పూర్తి చేసి బిల్లులు ప్రభుత్వానికి పంపాలని, అప్పుడే పనులు చేసిన వారికి సకాలంలో చెల్లింపులు జరిగే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మనందరి కర్తవ్యం అని, చట్టపరంగా పేదలకు ఎలా సహాయం చేయవచ్చో ఆలోచించి పనిచేయాలని సూచించారు. జనగామ జిల్లాను అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ముందంజలో నిలిపిన కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్కు, అలాగే అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్కు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. అనంతరం బదిలీపై జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్‌గా వెళ్తున్న రిజ్వాన్ భాషా షేక్‌ను, జీడబ్ల్యూఎంసీ జోనల్ కమిషనర్‌గా వెళు తున్న పింకేష్ కుమార్‌ను శాలువాతో సత్కరించి పూలమొక్కను అందజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, ఆర్డీవోలు, డీఆర్‌డీఏ పీడీలు, హౌసింగ్, నీటిపారుదల శాఖ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జంక్షన్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు




**హన్మకొండ, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా చేపట్టిన "అరైవ్ అండ్ అలైవ్ ప్రోగ్రామ్ -- రెండో దశ" లో భాగంగా అంబేద్కర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ఏసీపీ ట్రాఫిక్ టి. సత్యనారాయణ, హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి. సీతారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐలు కె. సంపత్, డి. కనకచంద్రం, హనుమకొండ, కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు. రాత్రి సమయంలో వాహనదారులను ఆపి శ్వాస పరీక్ష (బ్రెత్ అనలైజర్) ద్వారా మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని గుర్తించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణనష్టం సంభవించే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# గ్రీన్ అండ్ సస్టైనబుల్ కెమిస్ట్రీపై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం



**హన్మకొండ, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

సుబేదారిలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మార్చి 9 నుండి 13 వరకు "గ్రీన్ అండ్ సస్టైనబుల్ కెమిస్ట్రీ -- ఇన్నోవాషన్స్ ఇన్ టీచింగ్ అండ్ లేబరటరీ ప్రాక్టీసెస్" అనే అంశంపై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రీన్ మరియు సస్టైనబుల్ కెమిస్ట్రీ రంగంలో ఆధునిక బోధనా విధానాలు, ప్రయోగశాల నిర్వహణలో సరికొత్త ఆవిష్కరణలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలలో ఆసక్తి గల ఉపాధ్యాయులు, అకాడమిషియన్లు రూ.1000 నమోదు రుసుము చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పరిశోధక విద్యార్థులు రూ.500 రుసుమును ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఖాతాలో జమ చేసి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆచార్య జి. హనుమంతు, రసాయన శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎన్. వాసుదేవ రెడ్డి, ఆచార్య టి. సవితా జ్యోత్స్నతో పాటు విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

# కుమ్మెర జాతర ఘటనపై నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి

**హత్య కేసు నమోదు చేయాలని విద్యార్థి జేఏసీ డిమాండ్**



**హన్మకొండ, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర జాతర ఘటన జరిగి వారం రోజులు గడిచినా నిందితులను అరెస్టు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం విఫలమైందని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ చైర్మన్, బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆరేగంటి నాగరాజు గౌడ్ తీవ్రంగా విమర్శించారు. కేయూ పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీలపై దాడి జరిగినందుకే కేసు విచారణలో ఆలస్యం జరుగుతోందని ఆరోపించారు. ఇదే ఘటన అగ్రకులాలకు చెందిన వారి మీద జరిగి ఉంటే ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యం ప్రదర్శించేదా అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమ న్నారు. రాష్ట్ర బీసీ కమిషన్, ఎస్సీ ఎస్టీ కమిషన్ సంఘటనా స్థలాన్ని సందర్శించినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని ఆయన అన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి ఒక్క మంత్రి కూడా ముందుకు రాకపోవడం వెనుక వారు వెనుకబడిన వర్గాలకు చెందిన వారే కావడం కారణమా అని ప్రశ్నించారు. చిన్నారి ప్రాణాలు తీసిన వారిపై హత్య కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. ఒక సామాజిక వర్గానికి చెందినవారనే కారణంతో వారిని అరెస్టు చేయడంలో ఆలస్యం చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. తక్షణం చర్యలు తీసుకోకపోతే ఈ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా విస్తరించి రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇకపై బీసీలు, ఎస్సీ, ఎస్టీలపై ఇలాంటి దాడులు జరిగితే సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అజయ్, సుమన్ రాజ్, అన్వేష్, భీమన్న, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# 'కాజీపేట' సమస్యలపై పోరాడుదాం: దాస్యం వినయ్ భాస్కర్ పిలుపు





**కాజీపేట, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

కాజీపేట పరిధిలోని స్థానిక సమస్యల పరిష్కారానికై పోరాటం చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం కాజీపేటలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో డివిజన్‌ల ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన వినయ్ భాస్కర్, స్థానిక సమస్యలను ప్రజలతో కలిసి గుర్తించి వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేయాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వారి అసమర్థతను ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీల అమలుకు ప్రజల తరఫున పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలైన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు గుర్తుచేయాలని సూచించారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై అండగా నిలవాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని నాయకులకు సూచించారు. అధికార పార్టీ కుట్రపూరిత చర్యలు, బురదజల్లే రాజకీయాల పట్ల పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాజీపేట పరిధిలోని వివిధ డివిజన్‌ల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## మడికొండ కేంద్రంలో 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమం

**మడికొండ, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**




రోడ్డు ప్రమాదాల నివారణ, మద్యం సేవించి వాహనం నడపకుండా నిరోధించాలనే లక్ష్యంతో రెండో దశ 'అరైవ్ అలైవ్' ప్రచార కార్యక్రమంలో భాగంగా మడికొండ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం షెడ్యూల్‌లో నాల్గవ రోజు అంశంగా 'డ్రంక్ అండ్ డ్రైవ్ ఎన్‌ఫోర్స్‌మెంట్' పై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ సందర్భంగా మడికొండ ఎస్‌హెచ్‌ఓ సిబ్బందితో కలిసి వాహనదారులకు మద్యం సేవించి వాహనం నడపవద్దని, ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, అధిక వేగంతో వాహనం నడపకూడదని, సిగ్నల్స్‌ను గౌరవించాలని వాహనదారులకు వివరించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల కలిగే ప్రమాదాలు, చట్టపరమైన చర్యల గురించి కూడా అవగాహన కల్పించారు. ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని, భద్రతతో ప్రయాణించడమే లక్ష్యమని ఎస్‌హెచ్‌ఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డెక్కనున్న మహిళా సంఘాల 200 బస్సులు

**టెన్షన్ ఫ్రీ జర్నీకి మార్గం**




**హైద్రాబాద్, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు ఊరట కలిగించే శుభవార్త అందింది. రాష్ట్రంలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, మహిళా సంఘాల సమాఖ్యల ఆధ్వర్యంలో సమకూరుతున్న కొత్త బస్సులు త్వరలో రోడ్డెక్కనున్నాయి. ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళా పొదుపు సంఘాల ద్వారా సమకూర్చిన ఈ బస్సులను టీజీఎస్ఆర్టీసీ అద్దె ప్రాతిపదికన వినియోగించనుంది. ఇప్పటికే 200 బస్సులు బాడీ బిల్డింగ్ పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ ఇందిరా మహిళా శక్తి పథకంను అమలు చేస్తోంది. గత ఏడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మహిళా సంఘాల ఆర్థిక భాగస్వామ్యంతో బస్సులను సమకూర్చి, వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ఈ పథక ప్రత్యేకతగా నిలిచింది. ప్రస్తుతం మహిళా సంఘాల సమాఖ్యలు 152 బస్సులను ఆర్టీసీకి అద్దెకిచ్చాయి. ఆయా బస్సులకు డ్రైవర్లు, కండక్టర్లను ఆర్టీసీనే నియమించింది. ఒక్కో బస్సుకు నెలకు రూ.69,468 చొప్పున అద్దె చెల్లిస్తోంది. తాజా విడతలో సిద్ధమైన 200 బస్సులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే వీటిని ప్రజా సేవలోకి తీసుకురానున్నారు. అదనంగా మరో 248 బస్సులు వచ్చే మార్చి నెలాఖరునాటికి సిద్ధం కానున్నట్లు సమాచారం. మొత్తం 600 బస్సులను ఈ పథకం కింద ఆర్టీసీకి అందించాలనే లక్ష్యంతో అధికారులు ముందుకు సాగుతున్నారు. గతంలో ప్రైవేటు వ్యక్తుల నుంచి బస్సులను అద్దెకు తీసుకునే విధానం అమలులో ఉండేది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా జిల్లా రూట్లలో తీవ్ర రద్దీ నెలకొని, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అదనపు బస్సుల అవసరం అత్యవసరంగా మారింది. మొదటి విడతలో 152 బస్సులను పైలట్ ప్రాజెక్టుగా మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో నడిపారు. మహిళా సంఘాల నుంచి రుణాలు తీసుకున్న కారణంగా ఆ బస్సులను ఆయా సంఘాలకు హైపోథికేషన్ చేశారు. ఇప్పుడు రెండో విడతగా రాబోయే 200 బస్సులతో ఆర్టీసీపై ఉన్న ఒత్తిడి తగ్గి, ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, టెన్షన్ ఫ్రీ జర్నీ అందే అవకాశముంది. మహిళా సాధికారతను ప్రోత్సహిస్తూ, ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య రాష్ట్రంలో ఆదర్శవంతమైన మోడల్‌గా నిలుస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

## సుభేదారి కార్యాలయంలో సీడీపీఓ విధుల్లో మార్పులు

**పరంగల్‌లో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారిపై అధికారిక ప్రకటన**

**హన్మకొండ, 26 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

పరంగల్ కేంద్రంగా కొనసాగుతున్న ఐసీడీఎస్ (శిశు అభివృద్ధి సేవా పథకం) ప్రాజెక్ట్ పరిధిలో పనిచేస్తున్న చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీడీపీఓ)పై అధికారిక ప్రకటన విడుదలైంది. ఇంతకుముందు తెలియజేయబడిన అంశాల నేపథ్యంలో, పరంగల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయ పరిధిలో ఉన్న సంబంధిత అధికారి విధుల విషయంలో మార్పులు చోటుచేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. హనుమకొండ జిల్లా సుభేదారి ప్రాంతంలోని పూర్వ జిల్లా కలెక్టర్ బంగ్లా నివాసంలో విధులు నిర్వహిస్తున్న ఆ అధికారి ప్రస్తుతం అక్కడ కొనసాగడం లేదని స్పష్టం చేశారు. కెఎల్‌ఎన్ రెడ్డి కాలనీ, రోడ్ నం.2, హనుమకొండ నివాసంగా ఉన్న ఈ అధికారి కార్యాలయ వ్యవహారాల్లో పరిపాలనా మార్పులు అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. అధికారిక కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు, పై అధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ మేరకు జారీ చేసిన ప్రకటనను అధికారులు ధృవీకరించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# లింగ వివక్షత నిర్మూలనపై కఠిన చర్యలు





పి.ఎన్.డి.టి, ఎంటిపి చట్టాలపై శిక్షణ

**హన్మకొండ, 26 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

లింగ వివక్షత నిర్మూలనతో పాటు గర్భిణీ స్త్రీలకు సమగ్ర మాతా--శిశు సంక్షేమ సేవలు అందించేందుకు క్షేత్రస్థాయిలో మరింత చైతన్యం తీసుకురావాలని హనుమకొండ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి సూచించారు. జిల్లా కలెక్టర్, డీఎంహెచ్వో ఆదేశాల మేరకు హనుమకొండ కలెక్టరేట్‌లో వేలేరు, శాయంపేట ప్రాంతాల వైద్యాధికారులు మరియు క్షేత్రస్థాయి సిబ్బందికి పి.ఎన్.డి.టి (ప్రీ-కన్సెప్షన్, ప్రీ-నేటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్) మరియు ఎంటిపి (మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ) చట్టాలపై పునఃశ్చరణ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ, సమాజంలోని కొన్ని సాంఘిక కారణాల వల్ల ఇప్పటికీ పుట్టబోయే శిశువు లింగాన్ని తెలుసుకోవాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై, పరీక్షలు నిర్వహించే వారిపై కఠిన నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. బాలికల జనన శాతం తక్కువగా నమోదవుతున్న గ్రామాలను గుర్తించి, కారణాలను విశ్లేషించి నివేదిక సమర్పించాలని సూచించారు. ఎంసిహెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రుబీనా అఫ్రోజ్ మాట్లాడుతూ, చట్టాల పరిధి, ఉల్లంఘనలకు విధించే శిక్షలు, గర్భిణీ స్త్రీలు నమోదు అయినప్పటి నుంచి తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై సిబ్బందికి వివరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గర్భిణీ స్త్రీలకు రిజిస్ట్రేషన్ నుంచి ప్రసవం వరకు నాలుగు సార్లు పరీక్షలు నిర్వహించడం, లింగ వివక్షత నివారణకు సంబంధించిన సూచనలను మొబైల్ సందేశాల ద్వారా పంపించడం, ప్రత్యేక లేఖ అందజేయడం జరుగుతోందని తెలిపారు. జిల్లా మాస్ మీడియా అధికారి వేముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ, లింగ నిర్ధారణకు సంబంధించిన అక్రమ సమాచారాన్ని 6300030940 నంబర్‌కు లేదా టోల్ ఫ్రీ నంబర్లు 104, 1098లకు తెలియజేయాలని ప్రజలను కోరారు. క్షేత్రస్థాయి పరిస్థితులను విశ్లేషించేందుకు అనుసరించాల్సిన విధానాలపై సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో శాయంపేట వైద్యాధికారి డాక్టర్ సాయి కృష్ణ, ఎస్ఓజీ ప్రసన్నకుమార్, హెచ్ఈఈఓ చంద్రశేఖర్, పల్లె దవాఖాన వైద్యాధికారులు డాక్టర్ నవీన్, డాక్టర్ అభినందన్ రెడ్డి, డాక్టర్ అపర్ణ, డాక్టర్ విద్యశ్రీ, డాక్టర్ వినోద్ కుమార్, హెచ్ఈఓ వెంకటేశ్వర్లు, కే. సంపత్, రాజేశ్వర్ రెడ్డి, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## హనుమకొండలో మహా శాంతి హోమం - భక్తులకు ఆహ్వానం

**హన్మకొండ, 26 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**




కుటుంబ క్షేమం, దేశ శాంతి కోసం మహా శాంతి హోమాన్ని ఈ నెల 8వ తేదీన హనుమకొండలో ఘనంగా నిర్వహించనున్నారు. శ్రీ దత్తాత్రేయ స్వామి ఆశీస్సులతో, శ్రీ వారాహి అమ్మ అనుగ్రహంతో ఈ మహోత్సవం నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు. మార్చి 8, 2026 ఉదయం 9.00 గంటలకు హనుమకొండలోని కాళోజి కళా క్షేత్రం, హయగ్రీవాచారి గ్రౌండ్‌లో హోమ కార్యక్రమం ప్రారంభమవుతుంది. కుటుంబ క్షేమం మరియు దేశ శాంతి కోసము 500 హోమగుండాలతో మహా శాంతి హోమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మహా ఆధ్యాత్మిక మహోత్సవంలో భాగంగా వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు, మేళతాళాలు, నాట్యబృందాలతో ఘన స్వాగతం ఏర్పాట్లు చేస్తున్నారు. కాశీక్షేత్రం నుండి అఘోరులు, నాగసాధువులు విచ్చేసి భక్తులకు ఆశీర్వాదం అందించనున్నారు. దత్త గురువుల జన్మదినం సందర్భంగా ప్రత్యేక దీక్ష కార్యక్రమం, మహాప్రసాదం పంపిణీ, రుద్రాక్షలు, పసుపు, కుంకుమ, గాజుల పంపిణీ నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువుగారి చేతుల మీదుగా అమ్మవారి పాదస్పర్శ పొందే భాగ్యాన్ని భక్తులకు కల్పించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కాశీక్షేత్రంలో వారాహి అమ్మవారి మూర్తికి ప్రాణ ప్రతిష్ఠ అనంతరం అమ్మవారిని వరంగల్ పట్టణానికి ఘనంగా తీసుకురానున్నారు. అదే రోజు "మా భూలోక వారాహి" అనే భక్తి గీతాన్ని విడుదల చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు భారీ సంఖ్యలో హాజరై వారాహి అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని నిర్వాహకులు కోరారు.

## తెలంగాణలో 45 మంది ఐఏఎస్‌ల బదిలీ

రాహుల్ బొజ్జాకు సాధారణ పరిపాలన శాఖ బాధ్యతలు

పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్ కుమార్

రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్

యాదాద్రి భువనగిరి జిల్లా కొత్త కలెక్టర్‌గా అనురాగ్ జయంతి

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం 45 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ బదిలీలలో భాగంగా అత్యంత కీలకమైన సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) బాధ్యతలను రాహుల్ బొజ్జాకు అప్పగించారు. ఆయన జీఏడీ ముఖ్యకార్యదర్శిగా వ్యవహరిస్తూనే, బీసీ సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలను కూడా చూసుకోనున్నారు. సీనియర్ అధికారుల బాధ్యతల్లోనూ ప్రభుత్వం పలు మార్పులు చేసింది. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్ కుమార్‌ను, రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించింది. ఆర్థిక మరియు ప్రణాళికా విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్ బాధ్యతలు చేపట్టనుండగా, దేవాలయాల పర్యవేక్షణ బాధ్యతను ఎం. హనుమంతరావుకు (దేవదాయ శాఖ కమిషనర్) అప్పగించారు. ప్రజల సమస్యల పరిష్కార వేదిక 'ప్రజావాణి' రాష్ట్ర నోడల్ అధికారిగా డి. దివ్యను నియమించడం గమనార్హం. కేవలం సచివాలయ స్థాయిలోనే కాకుండా జిల్లాల పాలనలోనూ ప్రభుత్వం ప్రక్షాళన చేపట్టింది. పలు జిల్లాల కలెక్టర్లను మారుస్తూ తీసుకున్న నిర్ణయంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కొత్త కలెక్టర్‌గా అనురాగ్ జయంతి నియమితులయ్యారు. ఈ భారీ బదిలీల ద్వారా పాలనలో కొత్త ఉత్తేజం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

## పేదవాళ్ల ఇళ్లను కూలుస్తూ.. వేల కోట్లతో పార్కులా?: రేవంత్ సర్కార్‌పై ఈటల ధ్వజం

మూసీ ప్రక్షాళన పేరుతో వందలాది ఇళ్లను నేలమట్టం చేస్తున్నారని ఈటల మండిపాటు

పేదలకు కొత్తగా ఒక్క ఇల్లు కూడా ఇవ్వకపోగా, ఉన్న నీడను లాక్కుంటున్నారని విమర్శ

ఈ పరిణామాలపై రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఖమ్మం నుంచి హైదరాబాద్ వరకు సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తూ ప్రభుత్వం బడుగు జీవుల ఉసురు పోసుకుంటోందని ఆయన మండిపడ్డారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆయన, మూసీ ప్రక్షాళన పేరుతో వందలాది ఇళ్లను నేలమట్టం చేస్తున్నారని, మధుపార్క్ వంటి అపార్ట్‌మెంట్లలో నివసించే వారి ఆవేదన ప్రభుత్వానికి వినిపించడం లేదా అని నిలదీశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా, పేదలకు కొత్తగా ఒక్క ఇల్లు కూడా ఇవ్వకపోగా, ఉన్న నీడను లాక్కోవడం దారుణమని ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ బకాయిలు, విద్యార్థుల డైట్ ఛార్జీలకు నిధులు లేవని చెబుతున్న సర్కారు... వేల కోట్లు వెచ్చించి గాంధీ పార్కు నిర్మించాలనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. "బడా బాబులు వందల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే చూస్తూ ఊరుకుంటున్న పాలకులు, సామాన్యుడిపై మాత్రం జులుం ప్రదర్శిస్తున్నారు. కూకట్‌పల్లి ఎల్లమ్మబండ వద్ద 120 ఎకరాల భూమి అన్యాక్రాంతమైనా పట్టించుకునే నాథుడే లేడు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ గాంధీ పార్కు కట్టాలనుకుంటే, కేంద్ర రక్షణ శాఖ ఇచ్చిన భూముల్లో నిర్మించుకోవాలి కానీ, పేదల ఇళ్లను పడగొట్టి కాదని అన్నారు. తెలంగాణలో జరుగుతున్న ఈ పరిణామాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించాలని, ఇక్కడి 'దుర్మార్గాలను' తక్షణమే అరికట్టాలని ఈటల డిమాండ్ చేశారు. పేదల పొట్టకొట్టి చేస్తున్న ఈ అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని, ఇదే తీరు కొనసాగితే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇల్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి తక్షణమే ప్రత్యామ్నాయం చూపాలని, లేనిపక్షంలో బాధితుల తరపున పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..

సీబీఎస్ఈ సహా అన్ని స్కూళ్లలో ఇక తెలుగు తప్పనిసరి

తెలుగు భాషకు పట్టం కట్టే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు

1 నుంచి 10వ తరగతి వరకు తెలుగు కచ్చితంగా బోధించాలని ఆదేశాలు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

రాష్ట్రంలోని విద్యావ్యవస్థలో మాతృభాష తెలుగుకు పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భవిష్యత్ తరాలకు తెలుగు భాషా సౌరభాన్ని అందించడమే లక్ష్యంగా, వచ్చే 2026-27 విద్యా సంవత్సరం నుండి రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగును కచ్చితంగా ఒక సబ్జెక్టుగా బోధించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేవలం స్టేట్ బోర్డు పాఠశాలలకే పరిమితం కాకుండా, సీబీఎస్ఈ (జదీూజు), ఐసీఎస్ఈ (×జుూజు), ఐబీ (×దీ) వంటి అంతర్జాతీయ ప్రమాణాలతో నడిచే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లోనూ మాతృభాషను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం అనేక కార్పొరేట్ పాఠశాలల్లో మార్కుల వేటలో పడి తెలుగును విస్మరిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కేవలం స్కోరింగ్ కోసమే అరబిక్, సంస్కృతం వంటి భాషలకు ప్రాధాన్యతనిస్తూ, తెలుగును అటకెక్కిస్తున్న తీరుపై ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు కనీసం తెలుగులో చిన్న వాక్యాన్ని కూడా సరిగ్గా చదవలేకపోవడం భాషా సంక్షోభానికి దారితీస్తోందని గుర్తించిన సర్కారు, తెలుగు తప్పనిసరి అమలు చట్టం-2018ని కఠినంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. గతంలో కోవిడ్ కారణంగా 9, 10 తరగతులకు ఇచ్చిన మినహాయింపులను రద్దు చేస్తూ, 2025-26లో 9వ తరగతికి, 2026-27 నాటికి 10వ తరగతికి ఈ నిబంధనను వర్తింపజేయనుంది. అయితే, విద్యార్థులపై పనిభారం పడకుండా ప్రభుత్వం ఒక వినూత్న మార్పును ప్రవేశపెట్టింది. ఇతర బోర్డుల విద్యార్థుల కోసం కఠినమైన 'సింగిడి' పుస్తకాలకు బదులుగా, అత్యంత సరళంగా ఉండే 'వెన్నెల' పాఠ్యపుస్తకాలను రూపొందించింది. కేవలం ఇతర రాష్ట్రాల నుండి వచ్చి 8వ తరగతి ఆపై తరగతుల్లో చేరే విద్యార్థులకు మాత్రమే ఈ నిబంధన నుండి మినహాయింపు ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై భారీ జరిమానాలు విధిస్తామని, చట్టపరమైన చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. ప్రతి పాఠశాల తగినంత మంది తెలుగు ఉపాధ్యాయులను నియమించుకోవాలని, ఎస్‌సీఈఆర్‌టీ (రాజజు=ు) నిర్దేశించిన పుస్తకాలనే బోధించాలని స్పష్టం చేయడంతో, రాష్ట్రవ్యాప్తంగా తెలుగు భాషకు కొత్త ఊపిరి పోసినట్లయింది.

## వదిన వచ్చేసింది... ఆనంద్ దేవరకొండ ఆసక్తికర పోస్ట్

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తమ సుదీర్ఘ ప్రేమ ప్రయాణానికి ముగింపు పలుకుతూ వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. ఇరు కుటుంబాల మధ్య సంప్రదాయబద్ధంగా జరిగిన వీరి వివాహంతో అభిమానుల ఎదురుచూపులు ఫలించాయి. ఈ సంతోషకరమైన సందర్భంలో విజయ్ తమ్ముడు, నటుడు ఆనంద్ దేవరకొండ... రష్మికను 'వదిన' అని ఆప్యాయంగా సంబోధిస్తూ పెట్టిన సోషల్ మీడియా పోస్ట్ వైరల్ అవుతోంది. నూతన వధూవరులను ఆలింగనం చేసుకున్న ఫోటోను పంచుకుంటూ ఆనంద్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. "గతంలో చాలాసార్లు అభిమానులు 'వదిన, ఎలా ఉన్నారు?' అని అడిగినప్పుడు ఎలా స్పందించాలో నాకు తెలిసేది కాదు. కానీ ఈరోజు మా అన్నయ్యకు పెళ్లైంది. నాకు ఎంతో సానుకూల దృక్పథం, దయ ఉన్న వదిన దొరికింది. జీవితాంతం వాళ్లిద్దరూ ఇలాగే నవ్వుతూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని తన ఇన్స్టాగ్రామ్‌లో రాసుకొచ్చారు. వివాహ వేడుకలో విజయ్, రష్మిక పట్టు వస్త్రాలలో చూడముచ్చటగా కనిపించారు. నారింజ రంగు పట్టు చీర, టెంపుల్ జ్యువెలరీలో రష్మిక పెళ్లికూతురిగా మెరిసిపోగా, సంప్రదాయ పంచెకట్టులో విజయ్ దేవరకొండ రాజసంగా కనిపించారు. తెలుగు, కొడవ సంప్రదాయాల ప్రకారం వీరి వివాహం జరిగినట్లు సమాచారం. ఈ కొత్త జంట పెళ్లి ఫోటోలు చూసి అభిమానులు, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## యూట్యూబర్ కోమలి ఆత్మహత్య..

కలచివేస్తున్న డైరీలోని చివరి మాటలు

హైదరాబాద్‌లో యూట్యూబర్ బోను కోమలి అనుమానాస్పద మృతి

ఆత్మహత్యకు ముందు తన డైరీలో రాసిన చివరి నోట్ వెలుగులోకి

ప్రియుడితో బ్రేకప్ కారణంగానే బలవన్మరణానికి పాల్పడినట్లు అనుమానం

కువైట్‌లో ఉన్న తల్లికి చివరిసారిగా మెసేజ్ పంపిన కోమలి

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్‌లో సోమవారం ఓ యువ యూట్యూబర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. విశాఖపట్నంకు చెందిన బోను కోమలి (21) నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీఎస్సీ చదువుతూ, పార్ట్‌టైమ్ యూట్యూబర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆమె తాను అద్దెకు ఉంటున్న ఫ్లాట్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ప్రేమ విఫలం కావడమే ఆమె మరణానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఘటనా స్థలంలో ఆమె రాసిన ఓ డైరీ నోట్ పోలీసులకు లభించింది. "ముందుకు సాగిపోవాలంటే భయంగా ఉంది. ఎందుకంటే ఒకవేళ అతను తిరిగి వస్తే? నేను అతడిని వదిలేయాలని తెలుసు. అతను నా వాడు కాదని కూడా నాకు తెలుసు. నాతో ఉండటానికి అతను ప్రయత్నించడం లేదనీ తెలుసు. అయినా నాలోని ఏదో ఒక భాగం అతని కోసం ఇంకా ఎదురుచూస్తూనే ఉంది. ఏదో ఒక రోజు అతను నన్ను ఎంచుకుంటాడని ఆశిస్తూనే ఉంది" అని కోమలి తన డైరీలో ఆవేదన వ్యక్తం చేసింది. తాను పూర్తిగా దూరంగా వెళ్లిపోయిన తర్వాత, అతను వెనక్కి తిరిగి తన కోసం చూస్తే ఏం చేయాలనే భయం తనను వెంటాడుతోందని ఆ నోట్‌లో రాసింది. కోమలి గత మూడేళ్లుగా ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్/యూట్యూబర్‌తో ప్రేమలో ఉన్నట్లు తెలిసింది. అయితే, కొన్నాళ్ల క్రితం వీరిద్దరూ విడిపోయినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆరు నెలల క్రితం కూడా ఆమె ఒకసారి ఆత్మహత్యాయత్నం చేసినట్లు పోలీసులు గుర్తించారు. సోమవారం తెల్లవారుజామున కువైట్‌లో పనిచేస్తున్న తన తల్లి సత్య వరలక్ష్మికి "ఐ లవ్యూ మమ్మీ సో మచ్" అని, తమ్ముడిని జాగ్రత్తగా చూసుకోమని కోమలి మెసేజ్ పంపింది. ఆ తర్వాత ఆమె ఫోన్‌కు ఎన్నిసార్లు కాల్ చేసినా స్పందన లేకపోవడంతో ఆందోళన చెందిన ఆమె తల్లి, హైదరాబాద్‌లోని స్నేహితులకు సమాచారం ఇచ్చారు. వారు మధ్యాహ్నం ఫ్లాట్‌కు వెళ్లి చూడగా, తలుపులు మూసి ఉన్నాయి. పోలీసుల సహాయంతో తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా, కోమలి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని కనిపించింది. ఘటనా స్థలంలో ఓ నిచ్చెనను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కోమలి ఫోన్ రికార్డులు, మెసేజ్‌లు, స్నేహితుల వాంగ్మూలాలను సేకరించి ఆత్మహత్యకు దారితీసిన పూర్తి పరిస్థితులను విశ్లేషిస్తున్నారు. లైఫ్‌స్టైల్, వ్లాగ్స్ చేస్తూ సోషల్ మీడియాలో గుర్తింపు పొందిన కోమలి, ఇటీవల తిరుమలకు పాదయాత్ర చేసిన వీడియోతో వైరల్ అయింది. అదే ఆమె చివరి పోస్ట్ కావడం పలువురిని కలిచివేస్తోంది.

# కాకతీయ యూనివర్సిటీ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం

**హన్మకొండ, 26 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

ఉన్నత విద్యలో నైపుణ్యాభివృద్ధి ద్వారా నాణ్యత పెంపు లక్ష్యంగా విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకు మెంటరింగ్ అందించేందుకు కాకతీయ యూనివర్సిటీ సిద్ధంగా ఉందని వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి వెల్లడించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అధ్యక్షతన పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగ సెమినార్ హాల్‌లో నిర్వహించిన ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ మార్గదర్శకాల మేరకు డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల విద్యా షెడ్యూల్‌ను విశ్వవిద్యాలయంతో సమన్వయం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జాతీయ విద్యా విధానం--2020 (ఎన్‌ఈపి 2020), తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ అవసరాలకు అనుగుణంగా డిగ్రీ సిలబస్‌లో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని సూచించారు. ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధన ప్రాజెక్టులు, నైపుణ్యాధారిత కోర్సులు, క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ విధానం, మల్టిపుల్ ఎంట్రీ--మల్టిపుల్ ఎగ్జిట్ విధానాలను అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. అన్ని కళాశాలలు 'అపార్ ఐడి'లో నమోదు చేసుకుని వివరాలను సమయానికి అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. పరిశ్రమ--విశ్వవిద్యాలయ అనుసంధానాన్ని బలోపేతం చేస్తూ, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని టీ-హబ్‌తో మెంటరింగ్ సహకారాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఇంటర్న్‌షిప్‌ల అభివృద్ధి కోసం విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకోవాలని సూచించారు. అకడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంగా ఈ మెంటరింగ్ చేపట్టబడుతోందని వివరించారు. మొదటి దశలో విశ్వవిద్యాలయ పరిధిలోని 41 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 11 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఈ కార్యక్రమంలో భాగమవుతాయి. ఇందులో తొలి విడతగా 10 కళాశాలలకు మార్చి నెలలో ప్రత్యేక మెంటరింగ్ ప్రారంభమవుతుంది. మిగిలిన కళాశాలలను తరువాత దశలో చేర్చనున్నారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయ పరిధిలో ఒక నాక్ 'ఎం' గుర్తింపు పొందిన కళాశాల, 7 నాక్ 'ఎ' గ్రేడ్ కళాశాలలు ఉన్నాయని తెలిపారు. తదుపరి దశలో ప్రైవేట్ మరియు ఇతర సంస్థల కళాశాలలను కూడా చేర్చే ప్రణాళిక ఉందన్నారు. ఈ సమావేశ ప్రధాన లక్ష్యం చివరి సంవత్సరం అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులను శాఖల వారీగా విశ్వవిద్యాలయ చివరి సంవత్సరం పీజీ విద్యార్థులతో మెంటరింగ్ చేయించడం. ప్రతి సెమిస్టర్‌లో అతిథి ఉపన్యాసాలు, కెరీర్ గైడెన్స్ టాక్స్, పరిశోధన ధోరణులపై చర్చలు నిర్వహించనున్నారు. ఉపాధ్యాయుల కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్‌కు ఈ కార్యక్రమాన్ని అనుసంధానించనున్నారు. విశ్వవిద్యాలయ స్థాయిలో విభాగాల వారీగా మెంటరింగ్ సెల్స్ ఏర్పాటు చేసి, నెలవారీ సమీక్షలు, త్రైమాసిక




ప్రత్యక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. విద్యార్థుల హాజరు ట్రాకింగ్, నెమ్మదిగా నేర్చుకునే విద్యార్థుల గుర్తింపు, డ్రాప్‌అవుట్‌ల నివారణ, పీర్ మెంటరింగ్ వంటి చర్యలు చేపట్టబడతాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు విద్యార్థులను పీజీ కోర్సులపై అవగాహన కల్పించేందుకు విశ్వవిద్యాలయ ప్రయోగశాలలు, గ్రంథాలయం సందర్శనలు ఏర్పాటు చేస్తారు. పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్, బి.ఫార్మసీ చివరి సంవత్సరం విద్యార్థులతో చర్చలు జరుపుతారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని 10 కళాశాలల నుంచి ప్రతి కాలేజీకి ఐదుగురు చొప్పున చివరి సంవత్సరం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించనున్నట్లు ప్రకటించారు. ఎంపిక పూర్తిగా ప్రతిభ, సమాన అవకాశాల ఆధారంగా జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్ ప్రొఫెసర్ పి. వరలక్ష్మి, అకడమిక్ ఆడిట్ డీన్ ప్రొఫెసర్ జి. హనుమంత్, సీనియర్ ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి తదితరులు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

# ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు చేయూత

**దాస్యం వినయ్ భాస్కర్ పరామర్శ**



**హన్మకొండ, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నాలుగో డివిజన్ పరిధిలోని పెద్దమ్మ గడ్డ, జ్యోతిబసు నగర్ కాలనీలకు చెందిన అంబాల పోచమ్మ, పల్లె శివ, కడారి లక్ష్మిలు ఇటీవల మరణించడంతో వారి కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయా కుటుంబ సభ్యులను కలిసి వారి దుఃఖంలో భాగస్వామ్యమై, ధైర్యం చెప్పారు. కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేసి ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలిచారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, "ఆత్మీయులను కోల్పోవడం ఎప్పటికీ భర్తీ కాని లోటు. ఈ కష్ట సమయంలో మేము మీతోనే ఉన్నాం. భవిష్యత్‌లో కూడా అవసరమైన సహాయం అందిస్తాం" అని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని కుటుంబాలకు తమ సానుభూతిని తెలియజేశారు.

# మానవత్వాన్ని చాటుకుంటున్న సీనియర్ జర్నలిస్ట్


**మరణాంతరం కూడా తన సేవలు కొనసాగిస్తున్నారు**

**సమాజం పట్ల అంకితభావంతో పనిచేసిన జర్నలిస్టులలో నరసింహారావు ప్రదములు**

**సీనియర్ జర్నలిస్టు నరసింహారావు పేరు మీద గోల్డ్ మెడల్**

**అత్యధిక మార్కులు సాధిస్తున్న విద్యార్థులను అదే స్థాయిలో ప్రోత్సహిస్తున్నారు**

**హైదరాబాద్ జై భీమ్ న్యూస్:-**



సమాజ సేవ పట్ల అంకితభావం కలిగిన వ్యక్తులు చాలా అరుదుగా లభిస్తారని అలాంటి వాళ్ళలో కీర్తిశేషులు పెదమళ్ళ నరసింహారావు ఒకరరంటూ గర్వంగా చెప్పవచ్చు.సీనియర్ జర్నలిస్టుగా రెండున్నర దశాబ్దాల కాలం పాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించిన నరసింహ రావు తన కలానికి పదును పెట్టిన తీరు తనకు తాను సమాజానికి అంకితం చేసుకున్న తీరు మరువరానిదంటూ ఖమ్మం వాసులు గుర్తు చేస్తున్నారు.మనిషి జీవించినంత కాలం సమాజానికి ఎంతోకొంత మేలు చేయాలనే తపనతో పరితపించిన వ్యక్తిగా జర్నలిజం మూలాలను పునికిపుచ్చుకొని సమాజానికి తనదైన శైలిలో మేలు చేశారన్న సంగతిని నేటికీ సమాజం గుర్తుకు పెట్టుకుంటుంది.మండలంలోని బనిగండ్ల పాడు గ్రామానికి చెందిన పెదమళ్ళ. నాగేశ్వర రావు తన రెండవ కుమారుడు నరసింహ రావు పేరు మీద గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు గోల్డ్ మెడల్ క్రింద 10,000 రూపాయలు విరాళంగా ఇచ్చినారు. ప్రతి ఏడాది జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదివిన బాలికల్లో అన్ని కోర్సు ల్లో ఎవరైతే టాప్ మార్క్ప సాధిస్తారో వారికి లక్ష్మీ గోల్డ్ మెడల్ నరసింహారావు పేరు మీద ఇవ్వడం జరుగుతుందని తండ్రి నాగేశ్వరరావు తెలిపినారు. నరసింహారావు ఏడాదిన్నర క్రితం చనిపోయాడు. నరసింహారావు 24 సంవత్సరాలు వివిధ పత్రికల్లో స్టాఫ్ రిపోర్టర్, సబ్ - ఎడిటర్, బ్యూరో ఇంచార్జి గా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో సేవలు అందించారు.

# తెలంగాణ హైకోర్టులో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులపై విచారణ

**30 ఏప్రిల్ 2026 వరకు గడువు పొడిగింపు**

**హైద్రాబాద్, ఫిబ్రవరి 26 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులకు సంబంధించిన జీఓ నంబర్ 252, సవరించిన జీఓ 103పై దాఖలైన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు గురువారం విచారించింది. ఈ సందర్భంగా ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 ఏప్రిల్ 30 వరకు పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం కోర్టుకు తెలియజేసింది. జీఓ 252, జీఓ 103 సవరణలతో జర్నలిస్టుల వృత్తి కార్యకలాపాలు, సౌకర్యాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొంటూ తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టియూడబ్ల్యూజేఎఫ్) హైకోర్టును ఆశ్రయించింది. పిటిషనర్ తరపున అడ్వొకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా స్పెషల్ అడ్వకేట్ జనరల్ కోర్టుకు వివరణ ఇస్తూ, జర్నలిస్టుల పనితీరుకు ఆటంకం కలగకుండా తాత్కాలికంగా రెండు నెలల పాటు అక్రిడిటేషన్ కార్డుల గడువును పొడిగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వాదనలను రికార్డులోకి తీసుకున్న హైకోర్టు, ప్రస్తుత కార్డులు 2026 ఏప్రిల్ 30 వరకు చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. అదేవిధంగా, జీఓ 252, సవరించిన జీఓ 103పై లేవనెత్తిన అభ్యంతరాలకు సంబంధించి ప్రభుత్వం పూర్తి స్థాయి కౌంటర్ అఫిడవిట్ సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాల తర్వాతకు వాయిదా వేసింది. ఈ మధ్యంతర ఉత్తర్వులతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అక్రిడిటెడ్ జర్నలిస్టులు ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రయోజనాలను ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించవచ్చని కోర్టు పేర్కొంది. ఈ సందర్భంగా టియూడబ్ల్యూజేఎఫ్ జనరల్ సెక్రటరీ సయ్యద్ ఘౌస్ ముహియుద్దీన్ గడువు పొడిగింపును స్వాగతిస్తూ, ఇది తాత్కాలిక ఊరట మాత్రమేనని, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

# గరిమ అగ్రవాల్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరణ

**శుభాకాంక్షలు తెలిపిన గడ్డం నగేష్ తదితర అధికారులు**

**రాజన్న సిరిసిల్ల, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్లో గరిమ అగ్రవాల్ గురువారం జిల్లా కలెక్టర్‌గా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆమెను జిల్లా కలెక్టర్‌గా నియమించగా, అదే నేపథ్యంలో గురువారం ఉదయం విధుల్లో చేరారు. ఇదివరకు గరిమ అగ్రవాల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా, ఇంచార్జి కలెక్టర్‌గా అక్టోబర్ 23, 2025న బాధ్యతలు స్వీకరించి జిల్లా పరిపాలనను సమర్థంగా నిర్వహించారు. ఆ కాలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలన అందించారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పలువురు విభాగాధిపతులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధికారులు జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాధాన్య అంశాలపై కలెక్టర్‌కు సంక్షిప్త వివరణ అందించారు. ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శక పరిపాలన, ప్రభుత్వ పథకాల సమర్థ అమలుపై సమన్వయంతో పనిచేయాలని అధికారులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏవో రామ్ రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రావణ్, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భార్యతో కలహం... కాల్వలో దూకి యువకుడి ఆత్మహత్య

**హసన్ పర్తి, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడు కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గడ్డం ముత్యాలయ్య (27)కు భార్యతో కొంతకాలంగా కలహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్థాపానికి గురైన ముత్యాలయ్య గ్రామ సమీపంలోని ఎస్సెస్సీ కాలనీలో ఉన్న కాల్వలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కాల్వ నుంచి బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నట్లు తెలిసింది. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణమని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



# సర్పంచులను అవమానించిన అధికారులను సస్పెండ్ చేయాలి

**టీపీసీసీ అట్రాసిటీ స్టేట్ ఇంచార్జి తిప్పారపు సంపత్**





**హుజూరాబాద్, 26 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

హుజురాబాద్ మండలంలో నిర్వహించిన సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో అధికారుల వ్యవహార శైలి తీవ్ర వివాదానికి దారి తీసింది. సర్పంచులను అవమానించారంటూ సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ అట్రాసిటీ స్టేట్ ఇంచార్జి తిప్పారపు సంపత్ డిమాండ్ చేశారు. హుజురాబాద్ మండలం సింగపూర్ కిడ్స్ కాలేజీలో గత రెండు రోజులుగా సైదాపూర్, వీణవంక మండలాలకు చెందిన 53 మంది నూతన సర్పంచులకు జనరల్ ఓరియంటేషన్ శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో తిప్పారపు సంపత్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను కించపరిచే విధంగా అధికారులు ప్రవర్తించారని తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. శిక్షణ పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా సర్పంచులను నేరస్తుల మాదిరిగా నిలబెట్టి, తాము మాత్రం కుర్చీల్లో కూర్చొని ఫోటోలు దిగడం సభ్య సమాజం తలదించుకునే చర్యగా అభివర్ణించారు. పోలీసులు నేరస్తులను మీడియా ముందు నిలబెట్టి ఫోటోలు తీసినట్లుగా సర్పంచులను నిలబెట్టి చిత్రాలు దిగడం వారి గౌరవాన్ని దెబ్బతీయడమేనని అన్నారు. డిపిఓ జగదీశ్వర్, డీఎల్పిఓ శ్రీనివాస్‌తో పాటు ఎంపీడీఓ యాదగిరి (సైదాపూర్), ఎంపీడీవో రాజేశ్వరరావు (ఇల్లంతకుంట), ఎంపీఓ సురేందర్ (వీణవంక), గ్రామ సెక్రటరీ రేవంత్ రెడ్డి, స్వచ్ఛభారత్ రమేష్‌లు ఈ ఘటనకు బాధ్యులని ఆరోపించారు. ప్రజాప్రతినిధులను అవమానపరిచినందుకు సంబంధిత అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని, సర్పంచులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచులకు కనీస గౌరవం ఇవ్వని అధికారులు శిక్షణ ఇవ్వడానికి అనర్హులని, ఇలాంటి నియంతృత్వ ధోరణిని సహించబోమని హెచ్చరించారు. ఈ ఘటనపై రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు, మహిళా సర్పంచులను అవమానించిన విషయంపై మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారదకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తదితర పార్టీలకు చెందిన సర్పంచులను అవమానించిన ఈ ఘటనను జిల్లా కలెక్టర్ సీరియస్‌గా తీసుకుని సంబంధిత అధికారులపై సస్పెన్షన్ వేటు వేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీపీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ జీడీ రవితేజ, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ చిట్యాల రేవంత్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రేణిగుంట్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సమరంగా
జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా



## ఎత్తైన గాంధీ విగ్రహం ఏర్పాటుపై రేవంత్ ప్రభుత్వానికి యూట్యూబర్ అన్వేష్ మద్దతు

తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న 'మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్' ప్రాజెక్టు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించ తలపెట్టిన ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న తరుణంలో, ప్రముఖ ట్రావెల్ యూట్యూబర్ అన్వేష్ (నా అన్వేషణ) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయానికి పూర్తి మద్దతు ప్రకటించాడు. విగ్రహాల ఏర్పాటును కేవలం రాజకీయ కోణంలో చూడకూడదని, వాటి వెనుక ఉండే పర్యాటక ఆర్థిక సూత్రాన్ని గమనించాలని పిలుపునిచ్చాడు. గుజరాత్‌లోని 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ'ని ఉదాహరణగా చూపిస్తూ అన్వేష్ ఆసక్తికర విశ్లేషణ చేశాడు. నాడు సర్దార్ పటేల్ విగ్రహం కోసం రూ. 3 వేల కోట్లు ఖర్చు పెడుతుంటే విమర్శించిన వారు... ఆ విగ్రహం కారణంగా ఇప్పటి వరకు వచ్చిన రూ. 800 కోట్ల ఆదాయాన్ని గమనించాలని గుర్తుచేశాడు. ఇప్పుడు హైదరాబాద్‌లో రూ. 5 వేల కోట్లతో నిర్మించబోయే గాంధీ విగ్రహం కూడా భవిష్యత్తులో తెలంగాణకు కామధేనువులా మారుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశాడు. థాయ్‌లాండ్ వంటి దేశాలు కేవలం పర్యాటక రంగం ద్వారానే లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయని, అభివృద్ధి జరగాలంటే కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవని అభిప్రాయపడ్డాడు. "నేను ఏ పార్టీకి తొత్తును కాదు. రేపు కేసీఆర్ విగ్రహం కట్టినా, ఏపీలో ఎన్టీఆర్ విగ్రహం కట్టినా నా మద్దతు అభివృద్ధి వైపే ఉంటుంది" అని అన్వేష్ స్పష్టం చేశాడు. పర్యావరణం లేదా ఇతర సాకులు చెప్పి అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని అన్నాడు. 150 దేశాల పర్యాటక అనుభవంతో చెబుతున్నానని, ప్రపంచంలో ఎక్కడైనా ముందు టూరిజం స్పాట్‌ను డెవలప్ చేశాకే మౌలిక సదుపాయాలు వస్తాయని వివరించాడు. ఎవరు అడ్డుకున్నా రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తారని, విమర్శించే వారు కాలక్రమేణా మౌనంగా ఉండిపోక తప్పదని వ్యాఖ్యానించాడు. అయితే, ఇదే సమయంలో ప్రభుత్వానికి అన్వేష్ ఒక కీలక విజ్ఞప్తి చేశాడు. పర్యాటక అభివృద్ధి పేరుతో సామాన్య ప్రజల ఇళ్లను కూల్చడం, వారిని ఇబ్బందులకు గురిచేయడం వంటివి చేయకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని సూచించాడు.

## ఒక్కటైన విజయ్ దేవరకొండ, రష్మిక..

### ఉదయ్‌పూర్‌లో ఘనంగా వివాహం



టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ఎట్టకేలకు ఒక్కటయ్యారు. తమ రిలేషన్‌షిప్‌పై కొన్నేళ్లుగా వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ ఇవాళ ఉదయం 10:10 గంటలకు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వీరి వివాహం జరిగింది. విజయ్, రష్మిక మెడలో మూడు ముళ్లు వేసి ఆమెను తన జీవిత భాగస్వామిగా స్వీకరించారు. ఈ వివాహ వేడుక రెండు విభిన్న సంస్కృతుల కలయికగా అత్యంత వైభవంగా జరుగుతోంది. ఉదయం విజయ్ కుటుంబ పద్ధతిలో హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లి తంతు పూర్తికాగా, ఈరోజు సాయంత్రం 4:30 గంటలకు రష్మిక కుటుంబ ఆచారాల ప్రకారం మరోసారి వివాహం నిర్వహించనున్నారు. ఈ వేడుకకు పలువురు సినీ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పెళ్లికి ముందు జరిగిన వేడుకలు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. బుధవారం జరిగిన హల్దీ వేడుక ఫొటోలను ఈ జంట ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోగా, అభిమానులు పెద్ద ఎత్తున స్పందించారు. అంతకుముందు 'విరోష్ ప్రీమియర్ లీగ్' పేరుతో నిర్వహించిన క్రికెట్ మ్యాచ్ సైతం వైరల్‌గా మారింది. తమ అభిమాన జంట పెళ్లి చేసుకోవడంతో 'విరోష్' హ్యాష్‌ట్యాగ్‌తో నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య ఉదయ్‌పూర్‌లో వివాహం చేసుకున్న ఈ జంట, మార్చి 4న హైదరాబాద్‌లో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం భారీస్థాయిలో వెడ్డింగ్ రిసెప్షన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.



## మృణాల్‌తో సినిమా చేయాలనుంది: అల్లు అర్జున్ ఆసక్తికర పోస్ట్

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్‌తో కలిసి పనిచేయాలనే తన ఆసక్తిని బయటపెట్టారు. 'పుష్ప 2: ది రూల్' చిత్రానికి ఉత్తమ నటుడిగా 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకున్న సందర్భంగా మృణాల్ పంపిన అభినందనలకు ఆయన ఈ విధంగా స్పందించారు. ఈ పరిణామంతో వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తుందా అనే చర్చ మొదలైంది. ఇటీవల జరిగిన 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్‌లో అల్లు అర్జున్ 'పుష్ప 2' చిత్రంలోని నటనకు ఉత్తమ నటుడి అవార్డును గెలుచుకున్నారు. ఈ నేపథ్యంలో మృణాల్ ఠాకూర్ ఆయనకు ప్రత్యేకంగా పూల బొకేతో పాటు ఓ అభినందన సందేశాన్ని పంపారు. "ప్రతి ప్రదర్శనలో మీరు చూపించే అంకితభావం, తీవ్రత, అద్భుతమైన ప్రతిభ నిజంగా స్ఫూర్తిదాయకం. ఈ పురస్కారం మీకు అన్ని విధాలా అర్హమైనది" అని మృణాల్ తన సందేశంలో పేర్కొన్నారు. మృణాల్ పంపిన బొకే, నోట్‌ను తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో పోస్ట్ చేసిన బన్నీ, భవిష్యత్తులో ఆమెతో కలిసి పనిచేయాలనుకుంటున్నట్లు తెలిపారు. "థ్యాంక్యూ సో మచ్ మృణాల్ ఠాకూర్. మీ అభినందన చాలా మధురంగా ఉంది. ఎప్పటికైనా మీతో కలిసి పనిచేయాలని ఆశిస్తున్నాను" అని అల్లు అర్జున్ రాసుకొచ్చారు. ఇప్పటివరకు వీరిద్దరూ కలిసి నటించకపోవడంతో బన్నీ పోస్ట్ వైరల్‌గా మారింది. ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప' ఫ్రాంచైజీలోని మూడో భాగంతో పాటు లోకేశ్ కనగరాజ్, అట్లీ దర్శకత్వంలో సినిమాలకు సిద్ధమవుతున్నారు. మరోవైపు మృణాల్ ఠాకూర్, అడివి శేష్‌తో కలిసి నటించిన 'డకాయిట్' సినిమా విడుదల కోసం ఎదురుచూస్తున్నారు.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM